నేటి కందం-నేటికి అందం

విలువల తోడ కుషారే
పలురీతులుగా శ్రమించి బహుమతుల రికా
ర్డులు నెలకొల్పిన విధమును
దలచినచో ప్రతి హృదయము ధన్యత నొందున్ !!
(వ్యాయామ క్రీడా కారుడు సర్వేష్ కుషారే హైజంప్ లో పాత రికార్డులను బద్దలు కొట్టి క్రొత్త రికార్డు సృష్టించి భారత దేశపు ఘనతను చాటాడు.)
-రాధశ్రీ
సెల్:9494481210



# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com   ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433   E-mail:netinijam93@gmail.com

చురక

కాషాయం బెంగాల్లో
కప్పుకున్న జయస్ఫూర్తి
తొలిగింపు ఓట్లే కదా
తెచ్చుకున్న అప కీర్తి.
అవుతుందా తెలంగాణ
ఆదర్శం గెలుపు మెలిక
ప్రజలిక్కడ చైతన్యం
పీకేయరా కలుపు మొలక
-వేల్పుల నారాయణ
9440433475



హైదరాబాద్ మంగళవారం 30-6-2026   NETI NIZAM Telugu Daily,   RNI No.52865/93   Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001.   సంపుటి :32   సంచిక:251   పేజీలు:6   వెల: రూ.1/-


## లాంఛనంగా అమర్‌నాథ్ యాత్ర....

### ప్రథమపూజ చేసిన జమ్ముకశ్మీర్ గవర్నర్



న్యూఢిల్లీ, జూన్ 29: ప్రతిష్ఠాత్మక శ్రీ అమర్‌నాథ్ జీ యాత్ర-2026 లాంఛనంగా ప్రారంభమైంది. సోమవారం పవిత్ర గుహాలయంలో 'ప్రథమ పూజ 'ను శాస్త్రోక్తంగా నిర్వహించారు. జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఈ కార్యక్రమంలో పాల్గొని, యాత్ర సన్నాహాలకు అధికారికంగా శ్రీకారంచుట్టారు. ఈ సందర్భంగా ఆయన మంచులింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమం అనంతరం లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా 'ఎక్స్' వేదికగా తన సంతోషాన్ని పంచుకున్నారు.

'హర హర మహాదేవ్! శ్రీ అమర్‌నాథ్ జీ పవిత్ర గుహలో ప్రథమపూజ నిర్వహించడం నిజంగా నా అదృష్టం. ఇది వార్షిక యాత్రకు లాంఛనమైన ప్రారంభం. బాబా బర్ఫానీ ఆశీస్సులతో ప్రజలందరూ శాంతి, శ్రేయస్సు, సంపూర్ణ ఆరోగ్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించాను' అని ఆయన పేర్కొన్నారు. ఈ ఏడాది అమర్‌నాథ్ యాత్ర జూలై 3న ప్రారంభమై ఆగస్టు 28న శ్రావణ పౌర్ణమి, రక్షా బంధన్ పండుగలతో ముగుస్తుంది. మొత్తం 57 రోజులపాటు ఈ యాత్ర కొనసాగనుంది.

ఈ యాత్రను సురక్షితంగా, ఎలాంటి ఆటంకాలు లేకుండా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మనోజ్ సిన్హా తెలిపారు.

'యంత్రాంగం, పుణ్యక్షేత్రాల బోర్డు, సైన్యం, పోలీసులు, ఇతర భద్రతా దళాలు, స్థానిక ప్రజలు, సేవా ప్రదాతలు, వాలంటీర్లు అందరూ పూర్తి సమన్వయంతో పనిచేస్తున్నారు. భక్తులకు మరపురాని ఆధ్యాత్మిక అనుభూతిని అందించడానికి సర్వం సిద్ధం చేశాం' అని ఆయన భరోసా ఇచ్చారు. భారీగా మెరుగుపరిచిన మౌలిక సదుపాయాలు, అదనపు సౌకర్యాలతో యాత్రికులకు స్వాగతం పలికేందుకు సిద్ధంగా ఉన్నామని వివరించారు.

అనంతనాగ్ జిల్లాలోని కశ్మీర్ హిమాలయాల్లో సముద్ర మట్టానికి 3,880 అడుగుల ఎత్తులో ఈ పవిత్ర గుహ ఉంది. ఇక్కడి మంచుతో సహజసిద్ధంగా ఏర్పడే శివలింగాన్ని భక్తులు శివుని దివ్య శక్తులకు ప్రతీకగా భావిస్తారు. యాత్రికులు ప్రధానంగా రెండు మార్గాల ద్వారా గుహకు చేరుకుంటారు. సంప్రదాయ పహల్గామ్ మార్గంలో ప్రయాణానికి నాలుగురోజులు పడుతుంది. అయితే బల్తాల్ బేస్ క్యాంప్ నుంచి వెళ్లే యాత్రికులు దర్శనం చేసుకుని అదేరోజు తిరిగి రావచ్చు.

ఈ ఏడాది యాత్రలో ఒక ముఖ్యమైన మార్పు చోటుచేసుకుంది. బేస్ క్యాంపులైన పహల్గామ్, బల్తాల్ నుంచి పవిత్ర గుహకు వెళ్లే మార్గాన్ని 'నో-ఫ్లై జోన్'గా అధికారులు ప్రకటించారు. ఈ కారణంగా ఈ యాత్రలో భక్తులకు హెలికాప్టర్ సేవలు అందుబాటులో ఉండవని స్పష్టంచేశారు. యాత్రికులు ఈ మార్పును గమనించి అందుకు అనుగుణంగా తమ ప్రయాణ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

## భారత ఆర్థిక వ్యవస్థ పూర్తి స్థాయిలో పుంజుకుంది: ప్రధాని ప్రిన్సిపల్ సెక్రటరీ పీకే మిశ్రా

న్యూ ఢిల్లీ, జూన్ 29: భారత ఆర్థిక వ్యవస్థ పూర్తి స్థాయిలో పుంజుకుందని ప్రధానమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రమోద్ కుమార్ మిశ్రా స్పష్టం చేశారు. ఇటీవల విడుదలైన త్రైమాసిక, వార్షిక స్థూల దేశీయోత్పత్తి గణాంకాలే ఇందుకు ప్రత్యక్ష నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఢిల్లీలో ఇవాళ జరిగిన 20వ జాతీయ గణాంక దినోత్సవం సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతున్నప్పటికీ, భారత ఆర్థిక వ్యవస్థ మాత్రం పటిష్ఠమైన రికవరీని సాధించిందని మిశ్రా అన్నారు.

**డేటా ఆధారిత నిర్ణయాలే 'వికసిత్ భారత్'కు పునాది**

ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో ప్రభుత్వం తీసుకునే ప్రతీ నిర్ణయం సాక్ష్యాధారాలు, కచ్చితమైన డేటా ఆధారంగానే ఉంటుందని పీకే మిశ్రా వివరించారు. 'మనం సాధించే ప్రగతిని, పథకాల అమలును నిరంతరం కొలవడానికి డేటా ఎంతో అవసరం. 'వికసిత్ భారత్' (అభివృద్ధి చెందిన భారత్) లక్ష్యాన్ని చేరుకోవడానికి ఈ డేటా ఆధారిత నిర్ణయాలే దిక్సూచిగా మారనున్నాయి' అని ఆయన పేర్కొన్నారు.

ప్రస్తుతం.. ప్రభుత్వ శాఖలు, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్(ఆఖఎ) ద్వారా భారీ మొత్తంలో డేటా అందుబాటులోకి వస్తోందని మిశ్రా చెప్పారు. వివిధ మంత్రిత్వ శాఖల డిజిటల్ కార్యకలాపాల ద్వారా జనరేట్ అవుతున్న డేటాను సమర్థవంతంగా ఉపయోగించుకోవడానికి ప్రభుత్వం పలు అంశాలపై దృష్టి సారించిందని మిశ్రా తెలిపారు. విభిన్న శాఖల డేటాను ఒకదానితో ఒకటి అనుసంధానించేలా చేయడం, సంప్రదాయ సర్వే డేటాతో ఈ అడ్మినిస్ట్రేటివ్ డేటా సరిపోలేలా నాణ్యతను మెరుగుప రచడం, అధికారిక గణాంకాల పరిధిని విస్తృతం చేస్తూ నమ్మకమైన సమాచారాన్ని అందుబాటులోకి తేవడం వీటి ప్రధాన ఉద్దేశమని మిశ్రా వెల్లడించారు.

**ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ పాత్ర, మానవ వనరులు**

నిర్ణయాలను మరింత సమగ్రంగా, వేగంగా తీసుకోవడానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) సాంకేతికత అద్భుతమైన అవకాశాలను కల్పిస్తుందని మిశ్రా అభిప్రాయపడ్డారు. అయితే, అదే సమయంలో సాంకేతికతను సరిగ్గా ఉపయోగించుకునేలా మానవ వనరుల సామర్థ్యాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఏఐ అందించే ఫలితాలను క్షేత్రస్థాయిలో సరిచూసుకోవడం కూడా అంతే ముఖ్యమని ఆయన స్పష్టం చేశారు.

## వర్షం ఎఫెక్ట్.. మధిర రైతు ఆశీర్వాద సభ రద్దు..



హైదరాబాద్, జూన్ 29: ఖమ్మం జిల్లా మధిరలో రేపు(మంగళవారం) జరగాల్సిన రైతు ఆశీర్వాద సభ రద్దైంది. వర్షాల కారణంగా సభ నిర్వహించే పరిస్థితి లేకపోవడంతో మధిరలో జరగాల్సిన సీఎం రేవంత్ రెడ్డి సభలో మార్పులు చేశారు. రేపు సాయంత్రం హైదరాబాద్ శిల్పకళా వేదికలో రైతుభరోసా పంపిణీ సదస్సు నిర్వహించనున్నారు. ఇక్కడి నుంచే ముఖ్యమంత్రి.. రైతుభరోసా నిధులను విడుదల చేయనున్నారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లు చేయాలని మంత్రులు, అధికారులను సీఎం ఆదేశించారు.

మధిర నియోజకవర్గం చింతకాని మండలం జగన్నాథపురంలో రేపు రైతు ఆశీర్వాద సభ జరగాల్సి ఉంది. ఈ సభకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరై.. రైతుభరోసా నిధులను విడుదల చేయాలని నిర్ణయించారు. దీనికి సంబంధించి పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సభా ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు. దాదాపు లక్ష మందితో సభ నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకుని... అందుకు తగ్గట్టుగా జగన్నాథపురంలో ఏర్పాట్లు చేశారు.

అయితే, రెండు రోజులుగా కురుస్తున్న భారీగా వర్షాలకు సభా ప్రాంగణంలో పెద్దఎత్తున వరద నీరు చేరుకుంది. దీంతో సభ నిర్వహించేందుకు అవకాశం లేదని మంత్రులు, సీఎంవో కార్యాలయానికి జిల్లా అధికారులు తెలియజేశారు. దీంతో ప్రభుత్వం మధిరలో సభను రద్దు చేసి.. సభా వేదికను హైదరాబాద్‌కు మార్చింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి రైతులు తమ తమ రైతు వేదికల నుంచి ఈ సమావేశంలో పాల్గొననున్నారు.

## తెలంగాణ బియ్యానికి ప్రపంచ గుర్తింపే లక్ష్యం

### -మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి




హైదరాబాద్, జూన్ 29: తెలంగాణను ప్రపంచ బియ్యం ఎగుమతుల కేంద్రంగా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. బియ్యం ఉత్పత్తిలో రాష్ట్రం ఇప్పటికే మిగులు రాష్ట్రంగా నిలిచిందని, విలువ ఆధారిత బియ్యం ఉత్పత్తులకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా అంతర్జాతీయ మార్కెట్లలో తెలంగాణకు ప్రత్యేక గుర్తింపు తీసుకొస్తామని అన్నారు.

హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో కేసీపీ న్యూట్రీ సంస్థ రూపొందించిన మల్టీవిటమిన్ రైస్ ఉత్పత్తులను రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణను ప్రపంచ బియ్యం ఎగుమతుల కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కార్యాచరణ చేపట్టిందని తెలిపారు.

రాష్ట్రంలో ప్రస్తుతం ఏటా సుమారు 300 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం ఉత్పత్తి జరుగుతోందని, దీంతో తెలంగాణ మిగులు బియ్యం ఉత్పత్తి చేసే రాష్ట్రంగా ఎదిగిందని మంత్రి పేర్కొన్నారు. ఈ సామర్థ్యాన్ని మరింత సమర్థంగా వినియోగించుకోవడానికి విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు.

ఫోర్టిఫైడ్ (పోషక విలువలు పెంచిన) బియ్యం ఉత్పత్తికి ప్రోత్సాహం అందించడం ద్వారా రైతులకు, రైస్ మిల్లర్లకు మెరుగైన ఆదాయం లభిస్తుందని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. అదే సమయంలో అంతర్జాతీయ మార్కెట్లలో తెలంగాణ బియ్యానికి ప్రత్యేక బ్రాండ్ ఇమేజ్ ఏర్పడేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతికత, విలువ ఆధారిత ఆహార ఉత్పత్తుల తయారీకి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఇలాంటి వినూత్న ఉత్పత్తులు రైతుల ఆదాయాన్ని పెంచడమే కాకుండా తెలంగాణ బియ్యాన్ని ప్రపంచ మార్కెట్లో మరింత పోటీ సామర్థ్యం కలిగిన ఉత్పత్తిగా నిలబెడతాయని ఆయన అభిప్రాయపడ్డారు.

## ఏరువాక పౌర్ణమి తెలంగాణ రైతుల సంస్కృతికి ప్రతీక: మంత్రి పొన్నం ప్రభాకర్



సిద్దిపేట జిల్లా, జూన్ 29 : ఏరువాక పౌర్ణమి తెలంగాణ రైతుల సంస్కృతికి ప్రతీక అని మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. రైతులందరికీ ఏరువాక పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. ఈరోజు (సోమవారం) హుస్నాబాద్ నియోజకవర్గం కోహెడ మండలంలోని కూరెల్ల గ్రామంలో ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకుని రైతులతో కలిసి మంత్రి పొన్నం దుక్కి దున్ని విత్తనాలు చల్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.తెలంగాణలో సమృద్ధిగా వర్షాలు పడి పాడి పంటలతో ఆయురారోగ్యాలతో రైతులు ఉండాలని మంత్రి పొన్నం ఆకాంక్షించారు. అన్నదాతలు సంతోషంగా ఉంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని తెలిపారు. అందుకే తమ ప్రభుత్వం రైతన్నల సంక్షేమాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని వివరిం చారు. వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ నాణ్యమైన విత్తనాలను మాత్రమే అన్నదాతలు వినియోగించాలని సూచించా రు. సాంకేతిక పరిజ్ఞానంతో అధిక దిగుబ డులు సాధించే దిశగా రైతన్నలు ముందుకు సాగాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

## ఆర్మీ చీఫ్‌గా లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్ నేడు బాధ్యతల స్వీకరణ



న్యూ ఢిల్లీ, జూన్ 29:భారత మిలిటరీకి కొత్త టాప్ ఆఫీసర్లు రానున్నారు. భారత ఆర్మీ చీఫ్‌గా మంగళవారం లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్ (ఒతివబీబివనిజీనిబి ఉ వనివతీజీశ్రీ ఆష్ట్రతిజీతీ రావబిష్ట్ర)బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇక బుధవారం భారత వైమానిక దళ వైస్ చీఫ్‌గా ఎయిర్ మార్షల్ అశుతోష్ దీక్షిత్ బాధ్యతలు స్వీకరిస్తారు. భారతీయ రక్షణ వ్యవస్థలో ఇటీవలే కొత్తగా ఇద్దరు ఉన్నత పదవులను అలంకరించిన విషయం తెలిసిందే. చీఫ్ ఆఫ డిఫెన్స్ స్టాఫ్‌గా జనరల్ ఎన్ఎస్ రాజా సుబ్రమణి, నేవీ చీఫ్‌గా అడ్మిరల్ కృష్ణ స్వామినాథన్.. బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే.

ప్రస్తుతం ఆర్మీ వైస్ చీఫ్‌గా ఉన్న జనరల్ సేథ్.. జనరల్ ఉపేంద్ర ద్వివేది స్థానంలో ఆర్మీ చీఫ్‌గా బాధ్యతలు తీసుకుంటారు. ధీరజ్ సేథ్.. ఆర్మర్డ్ కాప్స్ చెందిన వ్యక్తి. ఆయన 1986లో ఆర్మీలో కమిషన్ అయ్యారు. మూడు దశాబ్దాల తర్వాత ఆర్మర్డ్ కాప్స్‌కు చెందిన ఆఫీసర్ ఆర్మీ చీఫ్‌గా బాధ్యతలు తీసుకోనున్నారు. 1997లో చివరిసారి ఆర్మర్డ్ కాప్స్‌కు చెందిన జనరల్ రాయో చౌదరి ఆర్మీ చీఫ్‌గా చేశారు. లెఫ్టినెంట్ జనరల్ సేథ్‌కు ఆపరేషనల్, స్ట్రాటజిక్, క్యాపబులిటీ డెవలప్మెంట్, ఇన్‌స్టిట్యూషనల్ డొమెయిన్స్‌లో విస్తృతమైన అనుభవం ఉన్నది.

జూలై ఒకటో తేదీన ఐఏఎఫ్ వైస్ చీఫ్‌గా ఎయిర్ మార్షల్ అశుతోష్ దీక్షిత్ బాధ్యతలు స్వీకరిస్తారు. ప్రస్తుతం ఐఏఎఫ్ చీఫ్‌గా ఉన్న ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్‌తో సమానంగా ఉన్న సీనియన్ అధికారి ఆయన. అయితే ఈ ఏడాది అక్టోబర్‌లో ఆయన పదవీకాలం పూర్తి కానున్నది. ప్రస్తుతం చీఫ్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ స్టాఫ్‌గా దీక్షిత్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. సీడీఎస్ నేతృత్వంలో త్రివిధ దళాలకు చెందిన సీఐఎస్సీ పనిచేస్తుంది. ఆయన ఫైటర్ పైలట్ కూడా. బెంగుళూరులోని ఫ్లయిట్ టెస్ట్ స్క్వాడ్రన్‌లో కమాండింగ్ ఆఫీసర్‌గా చేశారు

## ఎరువులపై ఆందోళన వద్దు-మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు



హైదరాబాద్, జూన్ 29:ఎరువుల లభ్యతపై రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భరోసా ఇచ్చారు. సాంకేతికతను వినియోగిస్తూ రైతులు ఇంటి నుంచే యాప్ ద్వారా పారదర్శకంగా ఎరువులు బుక్ చేసుకునే విధానాన్ని ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిందని తెలిపారు.

రాష్ట్రంలోని రైతులకు ఎరువుల కొరత తలెత్తకుండా ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టిందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఎరువుల కోసం రైతులు క్యూలలో నిలబడాల్సిన అవసరం లేదని, ఇంటి నుంచే మొబైల్ యాప్ ద్వారా పారదర్శకంగా బుకింగ్ చేసుకునే సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించిందని పేర్కొన్నారు.

ఎరువుల సరఫరాపై ఎలాంటి ఆందోళన అవసరం లేదని స్పష్టం చేసిన మంత్రి, రైతుల అవసరాలకు అనుగుణంగా సకాలంలో ఎరువులు అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఎరువుల పంపిణీ వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంచేందుకు డిజిటల్ విధానాలను అమలు చేస్తున్నామని వివరించారు.

పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు, అంతర్జాతీయ సరఫరా వ్యవస్థలో ఎదురైన సవాళ్లు ఉన్నప్పటికీ కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సమన్వయం చేసుకుని రాష్ట్రానికి అవసరమైన ఎరువులను సకాలంలో అందించగలిగామని మంత్రి తెలిపారు.

ౖరతుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్న తుమ్మల నాగేశ్వరరావు, వ్యవసాయానికి అవసరమైన అన్ని ఇన్‌పుట్లు రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందించే దిశగా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు.

ఎరువుల పంపిణీలో పారదర్శకత, అందుబాటును మరింత మెరుగుపరుస్తూ రైతులకు మెరుగైన సేవలు అందిస్తామని ఆయన స్పష్టం చేశారు.

## అయోధ్య విరాళాల కేసు నిందితుల తరపున ఎవరూ వాదించొద్దు



న్యూ ఢిల్లీ, జూన్ 29:అయోధ్య బార్ అసోసియేషన్ కీలక నిర్ణయం తీసుకుంది. రామాలయ విరాళాల దుర్వినియోగం కేసులో అరెస్టైన ఎనిమిది మంది నిందితుల తరపున తమ సంఘానికి చెందిన ఏ న్యాయవాదీ కోర్టులో వాదించరాదని బార్ అసోసియేషన్ సోమవారం సంచలన తీర్మానం చేసింది. ఈ నిర్ణయాన్ని ఉల్లంఘించే న్యాయవాదులపై రూ.5 లక్షల జరిమానా విధిస్తామని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాళికా శరణ్ మిశ్రా స్పష్టం చేశారు.

నిందితులను స్థానిక కోర్టులో హాజరుపరిచిన రోజే నిర్వహించిన బార్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో ఈ తీర్మానాన్ని ఆమోదించారు. రామాలయానికి భక్తులు సమర్పించిన కానుకల దుర్వినియోగం ఆరోపణలు.. తమ మనోభావాలను తీవ్రంగా దెబ్బతీశాయని బార్ అసోసియేషన్ తెలిపింది. అందువల్లే సభ్యులంతా ఏకగ్రీవంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొంది. భవిష్యత్తు కార్యాచరణపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామంది.

ఇదే సమావేశంలో శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్‌రాయ్, ట్రస్ట్ సభ్యుడు అనిల్ మిశ్రా, ఆలయ నిర్మాణ ఇన్‌ఛార్జి గోపాల్‌రావుపై కేసు నమోదు చేయాలని కూడా బార్ అసోసియేషన్ తీర్మానించింది. వీరంతా మరో మూడు రోజుల్లో అయోధ్యను వీడాలని, లేనిపక్షంలో నగరమంతా బంద్ చేపట్టి, ఆలయాన్ని దిగ్బంధిస్తామని హెచ్చరించింది.

కాగా.. 2005లో రామ జన్మభూమి తాత్కాలిక ఆలయంపై జరిగిన ఉగ్రదాడి కేసులోనూ నిందితుల తరపున వాదించబోమని నాడు ఇదే బార్ అసోసియేషన్ ప్రకటించింది.

# డిజిటల్ ప్రపంచాన్ని ఏకం చేస్తున్న సోషల్ మీడియా

**(జూన్ 30న "ప్రపంచ సోషల్ మీడియా దినోత్సవం" సందర్భంగా)**

సోషల్ మీడియా నేటి కనీస అవసరం అయ్యింది. ఇది ప్రపంచవ్యాప్తంగా బిలియన్ల కొద్దీ ప్రజలను కలుపుతూ, వారికి సమాచారాన్ని అందిస్తోంది. ఈ ప్రపంచాన్ని ఒక గ్లోబల్ విలేజ్‌గా మార్చిన డిజిటల్ విప్లవానికి ధన్యవాదాలు. ఇప్పుడే పుట్టిన ఆల్ఫా జనరేషన్ పిల్లల నుండి వయోవృద్ధ సైలెంట్ మరియు వృద్ధ బేబీ బూమర్స్ వరకు అందరూ సోషల్ మీడియా ఫోటోలు, వీడియోల రుచిని ఆస్వాదిస్తున్నారు. సహపాఠులు, సమవయస్కులు, పాత సహచరులు, స్నేహితులు, బంధువులు, భౌతికంగా తెలియని ఆన్‌లైన్ స్నేహితులు, ఇతరులతో కనెక్ట్ అవ్వడం సోషల్ మీడియా వేదికల్లో ఒక విలువైన భాగం అవుతున్నదా. ప్రపంచవ్యాప్తంగా విస్తరించి ఉన్న కుటుంబ సభ్యులు తమ ఆలోచనలు, వార్తలను పంచుకోవడానికి ఒక సమావేశ స్థలంగా సోషల్ మీడియా వేదిక మారింది. దూర ప్రాంతాలలో ఉన్న స్నేహితులు, కుటుంబ సభ్యులను కనెక్ట్ చేయడం నుండి మార్కెటింగ్, వాణిజ్య కేంద్రోమగా మార్చడం వరకు, మనం ఒకరితో ఒకరు సంభాషించే విధానాన్ని సోషల్ మీడియా పునర్వచిస్తున్నది. కేవలం సందేశాలు పంపడానికి, ప్రజలతో కనెక్ట్ అవ్వడానికి మాత్రమే కాకుండా, సోషల్ మీడియా ఇప్పుడు ఒక ప్రాథమిక మార్కెట్‌గా మారింది, ఇక్కడ వినియోగదారులు తమ ప్రస్తుత అవసరాల కోసం వెతకవచ్చు, కొత్త ఉత్పత్తులను కనుగొనవచ్చు.

**ప్రపంచ సోషల్ మీడియా దినోత్సవం-2026:**

పౌర సమాజంపై సోషల్ మీడియా యొక్క సానుకూల మరియు ప్రతికూల ప్రభావాల గురించి అవగాహన కల్పించడానికి ప్రతి సంవత్సరం జూన్ 30న ప్రపంచ సోషల్ మీడియా దినోత్సవాన్ని పాటిస్తున్నాం. ప్రజలు ఒకరితో ఒకరు ఎలా సంభాషిస్తారో, కమ్యూనికేట్ చేస్తారో, స్నేహితులు, కుటుంబ సభ్యులు, మొత్తం ప్రపంచ జనాభాతో ఏం పంచుకుంటారో అనే దానిని సోషల్ మీడియా పునర్నిర్వచిస్తోంది. 2010లో "మ్యాషబుల్" ద్వారా స్థాపించబడిన ఈ వార్షిక కార్యక్రమం, ప్రపంచ కమ్యూనికేషన్, కమ్యూనిటీ నిర్మాణం, సాంస్కృతిక మార్పులపై డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల ప్రభావాన్ని వేడుకగా జరుపుకుంటుంది. ప్రపంచవ్యాప్తంగా సుమారు 5.79 బిలియన్ల మంది ప్రజలు సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లను చురుకుగా ఉపయోగిస్తున్నారు, ఈ నెట్‌వర్క్‌లలో ప్రతిరోజూ ప్రతి ఒక్కరు సగటున 2 గంటల 27 నిమిషాలు గడుపుతున్నారు. జెన్ జి యువత, సగటు వినియోగదారుడి కంటే రోజుకు 54 శాతం ఎక్కువ సమయాన్ని సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లపై, యూజర్-జనరేటెడ్ కంటెంట్‌ను చూడటంలో గడుపుతున్నారు. 8 బిలియన్లకు పైగా ఉన్న ప్రపంచ జనాభాలో, 5.79 బిలియన్ల నెటిజన్లు ఆన్‌లైన్‌లో కనెక్ట్ అవుతూ, సోషల్ మీడియా వినియోగదారులు ఇప్పుడు "సూపర్‌మెజారిటీ"గా ఉన్నారు. 2026 ప్రపంచ సోషల్ మీడియా దినోత్సవం, పేద, ధనిక అనే తేడా లేకుండా సమాజాన్ని సోషల్ మీడియా ఎలా ప్రభావితం చేసిందో గుర్తించే ఈ రోజు యొక్క 17వ ప్రపంచ వేడుకను సూచిస్తుంది.

**ప్రపంచ సోషల్ మీడియా దినోత్సవం-2026 యొక్క ఇతివృత్తం:**

ప్రపంచ సోషల్ మీడియా దినోత్సవం-2026 యొక్క ఇతివృత్తం "డిజిటల్ ప్రపంచాన్ని ఏకం చేయడం", అనే అంశంతో ప్రపంచవ్యాప్తంగా డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు ప్రజలను, సంస్కృతులను మరియు వర్గాలను ఎలా కలుపుతాయో తెలియజేయడంపై దృష్టి పెడుతుంది. ఈ రోజున సామాజిక మాధ్యమ నిపుణులకు, సృష్టికర్తలకు, సాధారణ వినియోగదారులకు సోషల్ మీడియా వేడుకగా సంబరాలు జరుపుకోవడానికి ఒక అవకాశాన్ని ఇస్తుంది, అదే సమయంలో ప్లాట్‌ఫారమ్‌లను మరింత మెరుగ్గా, ఆరోగ్యకరంగా, నిజాయితీగా ఉపయోగించడాన్ని ప్రోత్సహిస్తుంది. సృష్టికర్తలకు ధన్యవాదాలు చెప్పడం, పాత స్నేహితులతో తిరిగి కలవడం, కొత్త ప్లాట్‌ఫారమ్‌ను ప్రయత్నించడం, మీ స్వంత కథను లేదా సానుకూల సందేశాలను పంచుకోవడం, ఆన్‌లైన్ చర్చలలో పాల్గొనడం, చిన్న వ్యాపారాన్ని లేదా స్వచ్ఛంద సంస్థను ప్రోత్సహించడం, పాక్షిక విరామం తీసుకోవడం, యువతతో మాట్లాడటం, ఈ ప్లాట్‌ఫారమ్‌ల ప్రయోజనాలు, దుష్ప్రభావాలను వ్యాప్తి చేయడం, మీకు మరియు ఇతరులకు అవగాహన కల్పించడం, మీ ఫీడ్‌బ్యాక్‌ను ఆడిట్ చేయడం వంటి అనేక విధాలుగా సోషల్ మీడియా దినోత్సవాన్ని జరుపుకుంటారు.

**ముఖ్యమైన సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు:**

సోషల్ మీడియా దినోత్సవానికి అత్యంత ముఖ్యమైన భాగస్వాములు, బ్రాండ్‌లుగా మెటా, హూట్‌సూట్, స్ప్రౌట్ సోషల్, టిక్‌టాక్, లింక్‌డిన్, ఎక్స్/ట్విట్టర్, మ్యాడ్‌హేబుల్ మొదలైనవి బహుళ ప్రజాదరణ పొందాయి. 1997లో ప్రారంభించబడిన మొదటి సోషల్ మీడియా సైట్‌గా "సిక్స్‌డిగ్రీస్"ను పరిగణిస్తారు. 2004లో ఫేస్‌బుక్‌ను సహ-స్థాపించిన మార్క్ జుకర్‌బర్గ్‌ను "సోషల్ మీడియా దినోత్సవ హీరో"గా భావిస్తారు. మొదటి ఆధునిక సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 2002లో ఫ్రెండ్‌స్టర్. లింక్‌డిన్ 2003లో, ఫేస్‌బుక్ ప్రారంభమైన అదే సంవత్సరం 2004లో మైస్పేస్ ప్రారంభించబడ్డాయి. యూట్యూబ్ 2005లో వీడియోల కోసం తన వెబ్‌సైట్‌ను ప్రారంభించగా, ట్విట్టర్ 2006లో దానిని అనుసరించింది. ఇన్‌స్టాగ్రామ్ 2010లో ప్రారంభించబడింది. సోషల్ మీడియా వార్తలు, షాపింగ్, వ్యాపారాల కోసం ఇన్‌ఫ్లుయెన్సర్‌లను కనుగొనడం, సాధారణ వినోదం కోసం ఒక పెద్ద వనరుగా మారింది. ఏఐ, క్రియేటర్లు, సోషల్ కామర్స్ ద్వారా నిర్వచించబడిన యుగంలో 17వ సోషల్ మీడియా దినోత్సవ వేడుకలు జరుగుతున్నాయి. నెలవారీ ఫేస్‌బుక్ వినియోగదారులు 3 బిలియన్లు, ఇన్‌స్టాగ్రామ్ వినియోగదారులు 2 బిలియన్లకు పైగా, వాట్సాప్ వినియోగదారులు 2 బిలియన్లు, టిక్‌టాక్ వినియోగదారులు 1.5 బిలియన్లు మరియు వీచాట్ వినియోగదారులు 1.3 బిలియన్లు ఉన్నారు. ఒక్క చైనాలోనే ఒక బిలియన్‌కు పైగా సోషల్ మీడియా వినియోగదారులు ఉండగా, భారతదేశంలో 870 మిలియన్లు, అమెరికాలో 313 మిలియన్లు మరియు ఐరోపాలో 731 మిలియన్ల వినియోగదారులు ఉన్నారు.

సోషల్ మీడియా మర్యాదలు:

మన జీవితంలోని ఏ దశలోనైనా బాధ్యతాయుతమైన నెటిజన్‌గా పాటించాల్సిన కొన్ని మర్యాదలు ఉన్నాయి. ఆన్‌లైన్‌లో సంభాషించేటప్పుడు మీరు నిజాయితీగా మీలాగే ఉండండి. సంబంధాలను పెంచుకోవడానికి మనం కంటెంట్‌ను లైక్, కామెంట్, షేర్ చేయాలి కానీ, హానికరమైన వార్తలను కాదు. మనం ఆన్‌లైన్‌లో మాట్లాడేటప్పుడు ఎల్లప్పుడూ మర్యాదపూర్వకమైన మరియు వ్యక్తిగత లేదా వృత్తిపరమైన ధోరణిని ఉపయోగించాలి. ఆన్‌లైన్‌లో కంటెంట్‌ను షేర్ చేసేటప్పుడు అసలు మూలానికి తగినంత గుర్తింపు ఇవ్వండి. మీ పరిధిని లేదా కంటెంట్ మూలం యొక్క పరిధిని విస్తరించడానికి హ్యాష్‌ట్యాగ్‌లను ఉపయోగించండి. మీ ప్రేక్షకులను స్వయంగా పెంచుకోవడానికి విలువైన కంటెంట్‌ను సృష్టిద్దాం. ప్రతికూల ఆన్‌లైన్ వాదనలు లేదా సైబర్ బెదిరింపులలో పాల్గొనకుండా ఉండండి. సోషల్ మీడియా ఒక శాపంగా కాకుండా సానుకూల సాధనంగా పనిచేసేలా చూసుకోవడానికి, సమయ పరిమితుల సరిహద్దులను నిర్దేశించడం, మీ ఫీడ్‌ను నిర్వహించడం, సమాచారం యొక్క ప్రామాణికతను తనిఖీ చేయడం, భౌతిక ప్రపంచంతో తిరిగి కనెక్ట్ అవ్వడానికి డిజిటల్ డిటాక్స్‌లను షెడ్యూల్ చేయడం ద్వారా తగినన్ని విరామాలు తీసుకోవడం వంటి మీ డిజిటల్ అలవాట్లను నియంత్రణలోకి తీసుకోండి.

**సోషల్ మీడియా వరమా, శాపమా!**

సోషల్ మీడియా అనేది రెండు వైపులా పదునున్న కత్తి లాంటిది. అనుసంధానం, విద్య, వ్యాపార ప్రయోజనాల కోసం ఉపయోగిస్తే అది ఒక వరం. అదే వ్యసనం, సైబర్ బెదిరింపులు, అభ్యంతరకరమైన కంటెంట్‌ను చూడటం లేదా తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయడానికి దారితీసినప్పుడు అది శాపంగా మారుతుంది. సోషల్ మీడియా ప్రయోజనాలలో అనుసంధానం, సహకారాలు, బ్రాండింగ్, ఉద్యోగ అవకాశాలు, విద్యా సంస్కరణలు, దూరాలను తొలగించడం వంటివి ఉన్నాయి. అంతిమంగా, దాని ప్రభావం పూర్తిగా ఒక వ్యక్తి యొక్క వినియోగం, స్వీయ క్రమశిక్షణ, డిజిటల్ అక్షరాస్యతపై ఆధారపడి ఉంటుంది. ప్రపంచవ్యాప్త అనుసంధానాన్ని పెంపొందించడం, జ్ఞానం, సమాచారాన్ని పంచుకోవడం, ఆర్థిక అవకాశాలకు ఆస్కారం కల్పించడం, భావ ప్రకటనా స్వేచ్ఛను ఇవ్వడం ద్వారా ఇది ఒక వరంగా మారింది. ప్రతికూల మార్గాల్లో ఉపయోగిస్తే అది ఒక శాపం అవుతోంది. సోషల్ మీడియా వ్యసనం వల్ల ఏదైనా కోల్పోతామేమోనన్న భయం, ఆందోళన, నిరాశ, తక్కువ ఆత్మగౌరవానికి దారితీయవచ్చు. నకిలీ వార్తలు వేగంగా వ్యాపించి ప్రజాభిప్రాయాన్ని తారుమారు చేస్తూ విభజన కలిగించే 'ఎకో ఛాంబర్లను' సృష్టిస్తాయి. 'లైక్‌లు', అల్గారిథమిక్ స్క్రోలింగ్ యొక్క డోపమైన్ లూప్ అత్యంత వ్యసనకరమైనది, ఇది ఉత్పాదకతనే కాకుండా ఏకాగ్రతను నేరుగా తగ్గిస్తుంది. ఇది సైబర్ బెదిరింపులకు కూడా దారితీయవచ్చు. మన వ్యక్తిగత గోప్యతలోకి చొరబడవచ్చు. శారీరక మానసిక ఆరోగ్యంపై ప్రభావం, గోప్యతా సమస్యలు, తప్పుడు వార్తల వ్యాప్తి, దుర్వాసనల, తక్కువ గ్రహణశక్తి వంటి సోషల్ మీడియా యొక్క చీకటి కోణాలను బహిర్గతం చేయండి.

సామాజిక మాధ్యమాల గురించి లేదా మానవ సమాజంపై వాటి ప్రభావం గురించి ఎవరెలా భావించినప్పటికీ, గత శతాబ్దంలో విడుదలైన ఏ ఇతర సాంకేతికతతో పోల్చినా సమాజంపై అత్యంత పెద్ద ప్రభావాన్ని చూపింది సామాజిక మాధ్యమమే అనేది వాస్తవం.



-మధుపాళీ
9949700037

# ఎంఎస్ఎంఈల దీర్ఘకాలిక విజయానికి నాణ్యత, ఆవిష్కరణ, సాంకేతికతను అందిపుచ్చుకోవటం అత్యంత అవసరం: ఉప రాష్ట్రపతి

న్యూ ఢిల్లీ, జూన్ 29:న్యూఢిల్లీలోని డాక్టర్ అంబేడ్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో జరిగిన అంతర్జాతీయ ఎంఎస్ఎంఈ దినోత్సవం-2026 వేడుకలకు భారత ఉప రాష్ట్రపతి శ్రీ సీపీ రాధాకృష్ణన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు కేవలం ఆర్థిక రంగానికి సంబంధించినవి మాత్రమే కాదని... తొలితరం పారిశ్రామికవేత్తల సాహసానికి, యువత ఆకాంక్షలకు, మహిళా పారిశ్రామికవేత్తల పట్టుదలకు, సవాళ్లను అవకాశాలుగా మార్చుకున్న లక్షలాది చిన్న వ్యాపారాల స్థిరత్వానికి ప్రతీకలని కొనియాడారు. వికసిత్ భారత్-2047 దిశగా భారతదేశ ప్రయాణానికి శక్తిమంతమైన, చైతన్యవంతమైన ఎంఎస్ఎంఈ రంగం ఊతమిస్తుందని తెలిపారు.

పారిశ్రామికవేత్తగా తన ప్రయాణాన్ని ఉప రాష్ట్రపతి గుర్తు చేసుకున్నారు. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన తర్వాత తండ్రి ఇచ్చిన ఆర్థిక సహకారంతో దుస్తుల వ్యాపారాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ప్రారంభంలో ఎదుర్కొన్న సవాళ్ల గురించి వివరిస్తూ.. ప్రజా జీవితంలోకి ప్రవేశించటానికి ముందుగానే తనకున్న పట్టుదల, నిరంతర అభ్యాసం, కఠిన శ్రమతో ప్రముఖ నిట్‌వేర్ ఎగుమతి వ్యాపారాన్ని నిర్మించినట్లు తెలిపారు. ప్రారంభ అడ్డంకులను చూసి ఎప్పుడూ నిరుత్సాహపడవద్దని, వృత్తిలో నైపుణ్యం సాధించేందుకు పూర్తి అంకితభావంతో పనిచేయాలని యువ పారిశ్రామికవేత్తలకు సూచించారు.

కాయిర్ బోర్డు ఛైర్మన్‌గా పదవీకాలాన్ని గుర్తుచేసుకుంటూ శ్రీ సీపీ రాధాకృష్ణన్ పలు అంశాలను వివరించారు. ఈ రంగానికి సంబంధించి అంతకుముందు పెద్దగా అవగాహన లేదని... పరిశ్రమకు సంబంధించిన ప్రతి కోణాన్ని అర్థం చేసుకోవటంలో పూర్తిగా లీనమైనట్లు శ్రీ సీపీ రాధాకృష్ణన్ చెప్పారు. ఎగుమతిదారులతో కలిసి, ప్రతిష్ఠాత్మకమైన లక్ష్యాలను నిర్దేశించుకోవటం ద్వారా ఈ రంగం అద్భుతమైన వృద్ధిని సాధించిందన్నారు. "మీరు ఏదైనా సాధించాలని నిర్ణయించుకుంటే కష్టపడి వీూ రంగానికి సంబంధించిన ప్రతి విషయాన్ని నేర్చుకోండి. అప్పుడు విజయం ఖచ్చితంగా మిమ్మల్ని వరిస్తుంది" అని అన్నారు.

నాణ్యతా ప్రాముఖ్యత గురించి చెబుతూ... నాణ్యతా ప్రమాణాల విషయంలో రాజీ పడకూడదని ఉపరాష్ట్రపతి అన్నారు. ఖర్చులను తగ్గించుకునేందుకు నాణ్యతను ఎప్పుడూ పణంగా పెట్టకూడదని తెలిపారు. "పోటీదారుల కంటే మెరుగైన సేవలను, అత్యుత్తమ నాణ్యతను అందిస్తూ ఖర్చులను తగ్గించుకోవటంలోనే అసలైన విజయం దాగి ఉంది" అని చెప్పారు. రోజురోజుకూ పెరుగుతున్న పోటీతత్వ ప్రపంచ మార్కెట్లలో వ్యాపారాలు నిలదొక్కుకునేందుకు నాణ్యతే కీలకమని స్పష్టం చేశారు.

ఈ రంగంలో మరింత చైతన్యం రావాలని పిలుపునిస్తూ ప్రతి సూక్ష్మ పరిశ్రమ చిన్న పరిశ్రమగా, ప్రతి చిన్న పరిశ్రమ మధ్యతరహా పరిశ్రమగా ఎదగాలని ఉపరాష్ట్రపతి ఆకాంక్షించారు. కుటీర పరిశ్రమలుగా ప్రయాణాన్ని ప్రారంభించే వ్యవస్థాపకులు జీవితాంతం అదే స్థాయిలో ఉండిపోకూడదన్నారు. ఈ మార్పును సులభతరం చేసేందుకు తగిన పెట్టుబడులు, విధానపరమైన మద్దతు, సులభమైన రుణాల లభ్యత వంటివి ముఖ్యమని ఆయన స్పష్టం చేశారు.

ఎంఎస్ఎంఈల సార్వత్రిక నమోదును ప్రోత్సహించాలని ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖను ఉప రాష్ట్రపతి కోరారు. మెరుగైన నమోదు వల్ల డేటా నాణ్యత పెరుగుతుందని, తద్వారా ఈ రంగం కోసం వాస్తవ అవసరాల ఆధారంగా మరింత సమర్థవంతమైన విధానాలను రూపొందించేందుకు వీలవుతుందని అన్నారు.

ఈ ఏడాది ఐక్యరాజ్యసమితి ఇతివృత్తం "ఏఐ-ఆధారిత భవిష్యత్తులో మానవ వ్యవస్థాపకత" ను ప్రస్తావిస్తూ సాంకేతిక మార్పులను ముప్పుగా కాకుండా అవకాశంగా భావించాలని శ్రీ సీపీ రాధాకృష్ణన్ అన్నారు. గతంలో కంప్యూటర్లు అందుబాటులోకి వచ్చిన సమయంలో వ్యక్తమైన ఆందోళనలను గుర్తుచేస్తూ సాంకేతికత చివరికి కొత్త ఉపాధి అవకాశాలనే సృష్టించిందని చెప్పారు. కృత్రిమ మేధను కూడా నిర్మాణాత్మకంగా స్వీకరిస్తే వృద్ధికి కొత్త మార్గాలను సృష్టిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

ఖాదీ, గ్రామ పరిశ్రమల కమిషన్ (కేవీఐసీ) సేవలను అభినందిస్తూ తేనె ఉత్పత్తి, ఖాదీ వస్త్రాల వంటి రంగాల్లో ఈ సంస్థ అద్భుతమైన మార్పును తీసుకువచ్చిందని శ్రీ సీపీ రాధాకృష్ణన్ కొనియాడారు. ఖాదీ వస్త్రాలు గాంధేయ ఆదర్శాల నుంచి స్ఫూర్తి పొందినప్పటికీ అంతర్జాతీయ పోటీని తట్టుకుని నిలబడాలంటే మారుతున్న వినియోగదారుల అభిరుచులకు, సాంకేతిక పురోగతికి అనుగుణంగా నిరంతరం మారాల్సి ఉంటుందని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా జాతీయ చిన్న పరిశ్రమల కార్పొరేషన్ (ఎన్ఎస్ఐసీ) షెడ్యూల్ 'ఎ' కంపెనీగా పదోన్నతి పొందినందుకు ఉప రాష్ట్రపతి అభినందనలు తెలిపారు. పీఎంఈజీపీ 2.0 పోర్టల్, సమాధాన్ 2.0 పోర్టల్, ప్రొక్యూర్‌మెంట్, మార్కెటింగ్ సపోర్ట్ (పీఎంఎస్) 2.0 పోర్టల్, ఎంఎస్ఎంఈ గ్లోబల్ మార్ట్ 2.0 పోర్టల్, టెస్టింగ్ సెంటర్ పోర్టల్‌తో పాటు ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖకు చెందిన బహుభాషా సదుపాయాల కార్యక్రమాన్ని ఉప రాష్ట్రపతి ప్రారంభించారు. ఎంఎస్ఎంఈ ఐడియా హాకథాన్ 6.0ను కూడా ప్రారంభించారు. ఈ కార్యక్రమం సందర్భంగా స్వావలంబన భారత్ (ఎస్ఆర్ఐ) ఫండ్, పీఎం విశ్వకర్మ (పీఎంవీ) పథకాలకు సంబంధించిన ఈ-బుక్స్‌ను ఉప రాష్ట్రపతి ఆవిష్కరించారు. ఖాదీ, గ్రామీణ పరిశ్రమల కమిషన్ (కేవీఐసీ) నూతన ఉత్పత్తులను కూడా మార్కెట్లోకి విడుదల చేశారు.

ఈ కార్యక్రమంలో కేంద్ర ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి శ్రీ జితన్ రామ్ మాంఝీ, ఎంఎస్ఎంఈ శాఖ సహాయమంత్రి సుశ్రీ శోభా కరంద్లాజే, కేవీఐసీ ఛైర్మన్ శ్రీ మనోజ్ కుమార్, ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ భరత్ ఖేరా, మంత్రిత్వ శాఖకు చెందిన ఉన్నతాధికారులు, పరిశ్రమల ప్రముఖులు, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.






# కడెంలో మాజీ ఎంపీ రాథోడ్ రమేష్ వర్ధంతి



ఆదిలాబాద్, జూన్ 29 కడెం మండల కేంద్రంలో ఆదిలాబాద్ మాజీ ఎంపీ రమేష్ రాథోడ్ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బీజేపీ కడెం మండల అధ్యక్షుడు కాశవేణి శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.

ఈ సందర్భంగా రాథోడ్ రమేష్ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వెనుకబడిన వర్గాల అభివృద్ధికి, నియోజకవర్గ ప్రగతికి ఆయన చేసిన సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శులు పి. శ్రీరామ్, రాపర్తి శ్రీనివాస్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు జక్కుల సత్తన్న, ఎస్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇస్లావత్ మోహన్ నాయక్, మండల నాయకులు ఎన్. ప్రసాద్, ములికి కృష్ణ, పాలకుర్తి నగేష్, జి. ప్రసాద్, డి. తిరుమలయ్య, జి. వేణుగోపాల్, గట్ల నల్లగొండ, సకినాల ప్రవీణ్, ఎనగందుల భూమన్న, బైరి రమేష్, బాలు, లక్ష్మణ్, పార్టీ కార్యకర్తలు మరియు ఆయన అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# దేవాలయాల్లో ప్రభుత్వ విప్ ప్రత్యేక పూజలు..



కరీంనగర్, జూన్ 29: పెద్దపల్లి మండలం పెద్దకల్వల గ్రామంలోని శ్రీరాజరాజేశ్వర శివ పంచాయతన క్షేత్రంలో రూ.40 లక్షల సీజీఎఫ్ (అడు ఈ) నిధులతో నిర్మించనున్న రాజగోపురం, అర్చకుల వసతి గదుల నిర్మాణ పనులకు సోమవారం ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు శంకుస్థాపన చేశారు. అంతకుముందు ఆయన శివాలయంలో అమ్మవారికి, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా గ్రామస్థులు, ఆలయ కమిటీ సభ్యులు ప్రభుత్వ విప్‌ను ఘనంగా సన్మానించారు.

అనంతరం బొంపెల్లి గ్రామంలోని శ్రీరంగనాథ స్వామి ఆలయాన్ని సందర్శించిన విజయ రమణారావు.. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామి వారి రథోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య, పలు గ్రామాల ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కడెంలో సహకార వారోత్సవాలకు శ్రీకారం..

ఆదిలాబాద్, జూన్ 29 మండల కేంద్రంలోని పాండవాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్)లో సోమవారం సహకార వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. జూన్ 29 నుంచి జూలై 6 వరకు నిర్వహించనున్న ఈ వారోత్సవాలను పాండవాపూర్ పీఏసీఎస్ చైర్‌పర్సన్ రామడుగు శైలజ?రమేష్‌రావు ప్రారంభించి, వారోత్సవాల జెండాను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సహకార సంఘాలు గ్రామీణాభివృద్ధి, రైతుల సంక్షేమం, మహిళా సాధికారతకు విశేష సేవలు అందిస్తున్నాయని తెలిపారు.

# ప్రపంచ ఇంధన భవిష్యత్తులో గ్లోబల్ సౌత్ కీలక పాత్ర పోషించాలని భారత్ ఆకాంక్షిస్తుందని తెలిపే కథనాన్ని పంచుకున్న ప్రధానమంత్రి

న్యూ ఢిల్లీ, జూన్ 29:కేంద్రమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ రాసిన కథనాన్ని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ పంచుకున్నారు. సురక్షితమైన, దృఢమైన, సమాననమై, స్థిరమైన ప్రపంచ ఇంధన భవిష్యత్తుకు గ్లోబల్ సౌత్ దేశాలు కీలక పాత్ర పోషించేలా భారత్ చేస్తున్న ప్రయత్నాలపై ఈ కథనాన్ని రాశారు.

"బలమైన ఇంధన వ్యవస్థలు కేవలం పటిష్టమైన దేశీయ విధానాల ద్వారా మాత్రమే కాక... మరింత బలమైన అంతర్జాతీయ భాగస్వామ్యాల ద్వారా కూడా నిర్మితమవుతాయనే భారత్ విశ్వాసాన్ని ఈ కథనంలో మనోహర్ లాల్ ఖట్టర్ చక్కగా వివరించారు" అని శ్రీ నరేంద్ర మోదీ తెలిపారు.

2026లో బ్రిక్స్ అధ్యక్ష పదవిని భారత్ చేపట్టనున్న నేపథ్యంలో సురక్షితమైన, దృఢమైన, సమాననమై, స్థిరమైన ప్రపంచ ఇంధన భవిష్యత్తుకు గ్లోబల్ సౌత్ దేశాలు కేంద్రంగా ఉండాలని భారత్ ఆకాంక్షిస్తున్నట్లు కేంద్రమంత్రి శ్రీ మనోహర్ లాల్ ఖట్టర్ పేర్కొన్నారు.

స్థిరమైన ఇంధన వ్యవస్థలు కేవలం పటిష్టమైన దేశీయ విధానాల ద్వారానే కాక, మరింత బలమైన అంతర్జాతీయ భాగస్వామ్యాల ద్వారా కూడా ఏర్పడతాయన్న భారత్ విశ్వాసాన్ని ఆయన స్పష్టం చేశారు.

# చార్‌ధామ్-2026 తొలిదశ హెలికాప్టర్ కార్యకలాపాలు విజయవంతం

న్యూఢిల్లీ, జూన్ 29:చార్‌ధామ్ యాత్ర-2026 తొలిదశలో హెలికాప్టర్ కార్యకలాపాలు సురక్షితంగా, విజయవంతంగా పూర్తి కావడంపై కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ సగర్వంగా హర్షం ప్రకటించింది. యాత్రికులకు నిరంతరాయ, సురక్షిత, విశ్వసనీయ గగన సంధాన కల్పనలో చిత్తశుద్ధితో కూడిన ప్రభుత్వ నిబద్ధతకు ఇది నిదర్శనం.

చార్‌ధామ్ యాత్ర తొలిదశ ఈ ఏడాది ఏప్రిల్‌లో ప్రారంభం కాగా జూన్ 26న ముగిసిన నేపథ్యంలో యాత్రికులకు నిత్యం సుమారు 400 వంతున హెలికాప్టర్ రాకపోకల సేవలు అందాయి. ఈ మేరకు 12,032 షటిల్ సర్వీసుల ద్వారా 67,064 మంది యాత్రికులు ప్రయాణించారు. దీనికితోడు 2,065 చార్టర్ సర్వీసుల ద్వారా 11,715 మంది సేవలు పొందారు. ఈ విధంగా చార్‌ధామ్ సెక్టార్ పరిధిలో యాత్ర తొలి దశకు ఆసాంతం సురక్షిత, విశ్వసనీయ, సమర్థ అనుసంధానం విజయవంతమైంది.

ఈసారి తొలి దశలో కార్యకలాపాలు విజయవంతం కావడంపై పౌర విమానయాన శాఖ మంత్రి శ్రీ రామ్మోహన్ నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ- "ఈ యాత్రలో ప్రతి భక్తుడికీ సులభ, సౌకర్య సహిత, సురక్షిత ప్రయాణం దిశగా దూరదృష్టి గల ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలోని మా ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యమిచ్చింది. ఈ పవిత్ర యాత్రను ప్రతి ఒక్కరూ సురక్షితంగా, పూర్తి విశ్వాసంతో పూర్తి చేసేలా చూడటమే ప్రథమ కర్తవ్యంగా మేం కృషి చేశాం. ఇందులో భాగంగా డీజీసీఏ, హెలికాప్టర్ ఆపరేటర్లు, 'యూసీఏడీఏ' వంటి భాగస్వాములందరితో సన్నిహిత సమన్వయం నిమిత్తం యాత్ర ఆరంభానికి చాలా ముందుగానే పలు స్థాయిలలో సమీక్షలు నిర్వహించాం. తదనుగుణంగా సమగ్ర సన్నాహాలపై శ్రద్ధ వహించిన ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి శ్రీ పుష్కర్ సింగ్ ధామిని నేను ప్రత్యేకంగా అభినందించడంతోపాటు ధన్యవాదాలు తెలుపుతున్నాను" అని పేర్కొన్నారు.

విమానయానానికి దేశంలోనే అత్యంత కఠిన వాతావరణంగల చార్‌ధామ్ పరిధిలో హెలికాప్టర్ సేవలు ఏటా అందిస్తున్నాం. ఇక్కడి భౌగోళిక కఠిన పరిస్థితులు, అనుక్షణం మారిపోయే వాతావరణం, ఇరుకైన లోయలు, కార్యకలాపాలకు పరిమిత వ్యవధి సహా హెలికాప్టర్ రాకపోకల సాంద్రత అధికంగా ఉంటుంది. అందువల్ల అత్యున్నత ప్రమాణాలతో కార్యాచరణ ప్రణాళిక సహా కఠిన నియంత్రణ-పర్యవేక్షణలు అత్యావశ్యకం.

ఆ మేరకు హిమాలయ ప్రాంతంలో హెలికాప్టర్ సేవల సంబంధిత ప్రత్యేక కార్యాచరణ సవాళ్లను గుర్తించి, ఈ ఏడాది యాత్రల ఆరంభానికి ఎంతో ముందుగానే తమ మంత్రిత్వ శాఖ విస్తృత సన్నాహాలు ప్రారంభించిందని మంత్రి తెలిపారు.

ఇందులో భాగంగా కార్యాచరణ సంసిద్ధత, భద్రత సన్నద్ధతపై సమగ్ర అంచనా లక్ష్యంగా మంత్రి శ్రీ రామ్మోహన్ నాయుడు స్వయంగా పలుమార్లు ఉన్నత స్థాయి సమీక్ష సమావేశాలు నిర్వహించారు. కార్యాచరణ విధివిధానాలు, భద్రత నియమావళి, వాతావరణ సన్నద్ధత, అత్యవసర ప్రతిస్పందన యంత్రాంగాల మధ్య పూర్తి సమన్వయంపై నిశిత పర్యవేక్షణ కొనసాగించారు. ఈ దిశగా వివిధ సమావేశాల్లో ఆ మంత్రిత్వ శాఖతోపాటు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ), విమానాశ్రయాల ప్రాధికార సంస్థ (ఏఏఐ), ఉత్తరాఖండ్ పౌర విమానయాన అభివృద్ధి ప్రాధికార సంస్థ (యూసీఏడీఏ), భారత వాతావరణ విభాగం (ఐఎండీ) ప్రతినిధులతోపాటు హెలికాప్టర్ సేవాప్రదాతలు, ఉత్తరాఖండ్ ప్రభుత్వం సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

పౌర విమానయాన మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ సమీర్ కుమార్ సిన్హా, ఉత్తరాఖండ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ ఆనంద్ వర్ధన్‌ల సంయుక్త అధ్యక్షతన మరో ఉన్నత స్థాయి సమావేశంలో యాత్ర సంబంధిత సమగ్ర భద్రత చట్రాన్ని ఖరారు చేశారు. యాత్రా కాలమంతటా నిరంతర పర్యవేక్షణ కోసం వారిద్దరి నాయకత్వాన వారాంతపు సమీక్ష నిర్వహణను స్వాగతం చేశారు. కార్యాచరణలో తలెత్తే సమస్యలను సకాలంలో పరిష్కరించడానికి ఇది వీలు కల్పించింది.

దీనిపై మంత్రి శ్రీ రామ్మోహన్ నాయుడు స్పందిస్తూ- "మునుపటి యాత్రల సందర్భంగా చోటుచేసుకున్న దురదృష్టకర సంఘటనలు పునరావృతం కాకుండా హెలికాప్టర్ కార్యకలాపాల సంబంధిత ప్రతి అంశంపై మేం సమగ్ర సమీక్ష నిర్వహించాం. మూల కారణాలను గుర్తించి, నియంత్రణ-పర్యవేక్షణల బలోపేతం ద్వారా గగనతల రద్దీని సమన్వయం చేశాం. అలాగే, కార్యాచరణ మౌలిక సదుపాయాలను ఉన్నతీకరించి, విమానయాన భద్రతనే ఉమ్మడి లక్ష్యం ప్రధానంగా ప్రతి భాగస్వామిని అప్రమత్తంగా ఉంచాం" అని వివరించారు.

గగనతల రాకపోకల మెరుగైన నిర్వహణతోపాటు నిఘా, సమాచార ప్రసారం, వాతావరణ పర్యవేక్షణ, పైలట్ నైపుణ్యం, మౌలిక సదుపాయాల పెంపు, కార్యాచరణపై పర్యవేక్షణ సహిత బహుళ అంచెల భద్రత వ్యూహాన్ని అనుసరించామని ఆయన తెలిపారు.

మెరుగైన భద్రత చట్రం రూపకల్పనలో భాగంగా లోయ అంతటా హెలికాప్టర్ల క్రమబద్ధ రాకపోకల కోసం 'ఏఏఐ' ప్రత్యేక 'కె-రూట్స్' ప్రచురించింది. ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్-కమ్యూనికేషన్-నావిగేషన్ అండ్ సర్వైలెన్స్ (సీఎన్ఎస్) సిబ్బందిని వ్యూహాత్మకంగా మోహరించారు. తద్వారా సహస్రధార, సెర్సీలలో ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ) సేవలను 'ఏఏఐ' ప్రవేశపెట్టింది. బద్రీనాథ్, కేదార్‌నాథ్‌లలో శాశ్వత 'ఏటీసీ' మౌలిక సదుపాయాల కల్పన కోసం భూ సేకరణ సహా సురక్షిత హెలికాప్టర్ కార్యకలాపాల దిశగా తాత్కాలిక కార్యాచరణ సౌకర్యాలను ఏర్పాటు చేశారు.

నిఘా సంసిద్ధత ప్రణాళికలో భాగంగా కార్యాచరణ నిఘాను బలోపేతం చేస్తూ కీలక ప్రదేశాలలో 33 'పీటీజడ్' (పాన్-టిల్ట్-జూమ్) కెమెరాలను 'యూసీఏడీఏ' ఏర్పాటు చేసింది. హెలిప్యాడ్ కార్యకలాపాలు, ట్రాకింగ్, వాతావరణ నిఘా కేంద్రీకృత పర్యవేక్షణ కోసం సహస్రధార, సీతాపూర్‌లలో రెండు సమీకృత కమాండ్- కంట్రోల్- కమ్యూనికేషన్-సమన్వయ కేంద్రాలను (ఐ4సీ) ఏర్పరచారు.

'ఐఎండీ'తో సన్నిహిత సమన్వయం ద్వారా వాతావరణ పర్యవేక్షణ సామర్థ్యం కూడా గణనీయంగా మెరుగుపడింది. వాతావరణ నిఘాను మరింత బలోపేతం చేయడం కోసం సీతాపూర్, కేదార్‌నాథ్, బద్రీనాథ్, ఝూలా, ఖర్సాలీలలో 5 ఆటోమేటిక్ వెదర్ అబ్జర్వేషన్ సిస్టమ్స్, సీలోమీటర్లను ఏర్పాటు చేశారు. ప్రత్యక్ష, ముందస్తు వాతావరణ అంచనా సమాచారాన్ని హెలికాప్టర్ ఆపరేటర్లకు నిరంతరం చేరవేసేలా 'ఏటీసీ' అధికారులు చురుగ్గా వ్యవహరించారు.

చార్‌ధామ్ యాత్ర సమయంలో ప్రతి హెలికాప్టర్‌కు ట్రాకింగ్ పరికరాన్ని అమర్చి, 'ఐ4సీ' ద్వారా నిరంతర కేంద్రీకృత పర్యవేక్షణను కొనసాగించారు. ఇందుకోసం ఇప్పటికేగల కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌కు అదనంగా, 3 అదనపు వెరీ హై ఫ్రీక్వెన్సీ కమ్యూనికేషన్ సెట్లను సమకూర్చారు. తద్వారా కమ్యూనికేషన్ మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేశారు.

నిరంతర నిఘా, ఆకస్మిక తనిఖీ, భద్రత పరిశీలన కోసం కీలక హెలిప్యాడ్‌ల వద్ద ప్రత్యేక ఫ్లైట్ ఆపరేషన్స్-ఎయిర్‌వర్దీనెస్ బృందాలను మోహరించడం ద్వారా 'డీజీసీఏ' నియంత్రణ-పర్యవేక్షణను గణనీయంగా పెంచింది. అలసట సంబంధిత కార్యాచరణ ప్రమాదాల నివారణ దిశగా పైలట్ల ఫ్లైట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్స్ (ఎఫ్‌డీటీఎల్)ను రోజువారీగా పర్యవేక్షించింది.

హిమాలయాల్లో హెలికాప్టర్ కార్యకలాపాల క్లిష్టతను గుర్తించిన 'డీజీసీఏ' పైలట్ అర్హత నిబంధనలను మరింత పకడ్బందీగా నిర్వచించింది. ఈ యాత్ర సమయంలో పనిచేసే పైలట్లకు, కొండ ప్రాంతాల్లో విమానం నడిపిన అనుభవం వ్యవధిని 750 గంటలుగా నిర్దేశించింది. ఇందులోనూ గత ఏడాది కాలంలో 100 గంటల అనుభవంసహా కేదార్‌నాథ్‌లో కనీసం 10 టేకాఫ్-ల్యాండింగ్ చేసి ఉండాలని నిబంధన విధించింది. తద్వారా, ఈ కఠిన వాతావరణంలో అనుభవజ్ఞులైన పైలట్లు మాత్రమే హెలికాప్టర్లను నడిపేలా జాగ్రత్తలు తీసుకుంది.

భద్రత పెంపు దిశగానూ అనేక అదనపు చర్యలు తీసుకున్నారు. ముఖ్యంగా హెలికాప్టర్లలో ప్రయాణిక గరిష్ఠ సామర్థ్యాన్ని 70 శాతానికి పరిమితం చేశారు. చార్టర్ హెలికాప్టర్ కార్యకలాపాలను ఇదేవిధంగా హేతుబద్ధీకరించారు. పైలట్లకు స్పష్టంగా కనిపించేలా హై-టెన్షన్ ట్రాన్స్‌మిషన్ లైన్లకు విమానయాన భద్రత గుర్తులు, హెచ్చరిక బెలూన్లను అమర్చారు. ప్రయాణిక రాకపోకల సౌలభ్యం దిశగా నేలపై సమన్వయం మెరుగుకు అన్ని హెలిప్యాడ్‌లలో ఉమ్మడి గ్రౌండ్-హ్యాండ్లింగ్, క్రౌడ్-మేనేజ్‌మెంట్ యంత్రాంగాన్ని ఏర్పాటు చేశారు.

చివరగా పౌర విమానయాన శాఖ మంత్రి శ్రీ రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ- "విమానయానంలో భద్రతకే మేం అగ్ర ప్రాధాన్యమిచ్చాం. ఈ విషయంలో రాజీపడే ప్రసక్తే లేదు. భద్రత నిబంధనల ఉల్లంఘనను ఎంతమాత్రం సహించబోమని స్పష్టం చేశాం. పవిత్ర చార్‌ధామ్ యాత్రకు వచ్చే లక్షలాది భక్తుల భద్రతకు సంపూర్ణ భరోసా ఇవ్వడమే మా ప్రథమ కర్తవ్యంగా పరిగణించాం" అన్నారు.

దేశవ్యాప్తంగా హెలికాప్టర్ భద్రత నిరంతర బలోపేతానికి తమ శాఖ కట్టుబడి ఉందని ఆయన తెలిపారు. భద్రత ప్రమాణాల విషయంలో రాజీపడకుండా అత్యంత కఠిన భౌగోళిక ప్రదేశాల్లో 'చార్‌ధామ్ యాత్ర-2026' తొలి దశ విజయవంతమయ్యేలా హెలికాప్టర్ కార్యకలాపాలను నిర్వహించామని చెప్పారు.

# చేపల వేటలో విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి..

నల్గొండ, జూన్ 29: ఉపాధి కోసం చేపల వేటకు వెళ్లిన ఓ యువకుడు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన విషాద ఘటన ఆదివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం కాల్వపల్లి గ్రామంలో చోటుచేసుకుంది.

గ్రామస్తుల కథనం ప్రకారం.. కాల్వపల్లి గ్రామానికి చెందిన మేకల రాజు (30) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. పని లేని రోజుల్లో గ్రామ శివారులోని మానేరు వాగులో చేపలు పట్టేందుకు వెళ్లేవాడు.

ఈ క్రమంలో ఆదివారం గ్రామానికి చెందిన మరో నలుగురు వ్యక్తులతో కలిసి మానేరు వాగులో విద్యుత్ తీగల సహాయంతో చేపలు పట్టేందుకు వెళ్లినట్లు తెలుస్తోంది. చేపల వేట జరుగుతున్న సమయంలో ప్రమాదవశాత్తు రాజుకు విద్యుత్ షాక్ తగలడంతో వాగులో పడిపోయాడు.

తోటి వ్యక్తులు వెంటనే అతడిని బయటకు తీసినప్పటికీ అప్పటికే మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిట్యాల ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తరలించారు.

మృతుడికి భార్య మల్లీశ్వరి ఉన్నారు. రాజుతో కలిసి చేపల వేటకు వెళ్లిన నలుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# మున్సిపల్ మీటింగ్‌లో రసాభాస..



నల్గొండ, జూన్ 29:నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ సాధారణ సమావేశం సోమవారం వాగ్వాదాలతో రసాభాసగా మారింది. రెండో డివిజన్ కార్పొరేటర్ పెరిక యాదయ్య తన వార్డులోని సమస్యలను బ్యానర్ ద్వారా ప్రదర్శిస్తూ వాటి పరిష్కారం కోరారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతుండగా కాంగ్రెస్ కార్పొరేటర్లు అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది.

ఇదే సమయంలో 15వ డివిజన్ కార్పొరేటర్ దొడ్డి రమేష్ కూడా అభివృద్ధి పనులు, సమస్యల పరిష్కారంలో వైఫల్యం ఉందని వ్యాఖ్యానించడంతో చర్చ మరింత వేడెక్కింది.

ఇరువర్గాలు పరస్పరం ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకుంటూ దూషణలకు దిగడంతో సుమారు పది నిమిషాల పాటు సమావేశంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వెంటనే ఇతర కార్పొరేటర్లు, పోలీసులు జోక్యం చేసుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

ఈ సందర్భంగా పలువురు కార్పొరేటర్లు మాట్లాడుతూ, పాలకవర్గం ఏర్పడి ఐదు నెలలు గడిచినా అభివృద్ధి పనులకు ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని సమావేశంలో నిలదీశారు.

# జాతీయ రహదారి 65పై ఘోర రోడ్డు ప్రమాదం..

## -ఇద్దరు మృతి 6 గురికి తీవ్ర గాయాలు
## -హైదరాబాద్ వైపు భారీ ట్రాఫిక్ జామ్..

నల్గొండ, జూన్ 29:నల్గొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రంపల్లి గ్రామ శివారులో జాతీయ రహదారి 65 పై ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందగా మరో ఆరు గురికి తీవ్రంగా గాయలయ్యాయి. తెలిసిన వివరాల ప్రకారం హైదరాబాద్ నుండి నార్కట్పల్లి వైపు వెళ్తున్న డి-మ్యాక్స్ వి క్రాస్ వాహనం ను ఇన్నోవా కారు డికొట్టడంతో టైర్ బ్లాస్ట్ అయ్యి అదుపుతప్పి డివైడర్ దాటి హైదరాబాద్ వైపు వెళ్తున్న రోడ్డు సైడ్ దూసుకు వచ్చినీది. చిట్యాల నుండి హైదరాబాద్ వైపు వెళుతున్న కియా కారు, షిఫ్ట్ డిజైర్ కార్లను ఢీకొట్టడంతో డిజైర్ కారులో ప్రయాణించే ఆరుగురు వ్యక్తులలో దేప సరిత (46), కసిరెడ్డి దేవేందర్ రెడ్డి (సుమారు 50)లు తీవ్రంగా గాయపడి మృతి చెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు.

వీరిని చికిత్స నిమిత్తం నార్కట్‌పల్లి లోని కామినేని ఆసుపత్రి కి తరలించారు. అలాగే కియా కారులో ఉన్న ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడగా వారిని హైదరాబాద్ కు తరలించారు. మరో వ్యక్తికి స్వల్పంగా గాయాలు కావడంతో చౌటుప్పల్ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. జాతీయ రహదారిపై జరిగిన సంఘటన వల్ల హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలు భారీగా నిలిచిపోయాయి. సుమారు నాలుగు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయినట్లు సమాచారం. పోలీసులకు సమాచారం అందడంతో హుటాహుటిన చిట్యాల పోలీసులు, ఎన్ హెచ్ ఎ ఐ సిబ్బంది, నేషనల్ హైవే ట్రాఫిక్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని రోడ్డు పై ఉన్న వాహనాలను తొలగించి ట్రాఫిక్ జామ్ ను క్లియర్ చేసే చర్యలు చేపట్టారు..

# భారత్-యూకే సమగ్ర ఆర్థిక-వాణిజ్య ఒప్పందమిచ్చిన ఉత్తేజాన్ని సుస్థిర వ్యాపార సంబంధాలతో ముమ్మరం చేయాలి

## -పారిశ్రామికవేత్తలకు కేంద్ర వాణిజ్య-పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్ పిలుపు

న్యూఢిల్లీ, జూన్ 29:'భారత్-యూకే: ప్రగతి భాగస్వాములు' పేరిట లండన్‌లో నిర్వహించిన వాణిజ్య సదస్సుకు భారత వాణిజ్య-పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పారిశ్రామికవేత్తలను ఉద్దేశించి ప్రసంగిస్తూ- భారత్-యూకే సమగ్ర ఆర్థిక-వాణిజ్య ఒప్పందం (సెటా) ద్వారా లభించే అవకాశాలను వాణిజ్య వృద్ధిని ముమ్మరం చేయడానికి ఉపకరణాలుగా మలచుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మేరకు భారత కంపెనీలు తమ యూకే భాగస్వాములతో నిరంతర సంబంధాలు నెరపాలని సూచించారు.

ఈ సదస్సులో రెండు దేశాల నుంచి ప్రసిద్ధ పారిశ్రామికవేత్తలు, పరిశ్రమల ప్రతినిధులు హాజరయ్యారు. ద్వైపాక్షిక వాణిజ్యం, పెట్టుబడులను బలోపేతం దిశగా 'సెటా' ఒక వినూత్న చట్రమని అని వారు హర్షం వ్యక్తం చేశారు. దీర్ఘకాలిక పెట్టుబడులు, సాంకేతిక భాగస్వామ్యాలు, ఆవిష్కరణలు, పటిష్ఠ సరఫరా వ్యవస్థలకు ఈ ఒప్పందం ఉత్తేజమిస్తుందని వారు పేర్కొన్నారు. అలాగే, భారత్-యూకే మధ్య ఆర్థిక సహకార విస్తృతికి ఈ ఒప్పందం ఎంతగానో దోహదం చేస్తుందని చర్చల సందర్భంగా అభిప్రాయపడ్డారు.

సదస్సులో ప్రధానంగా 'సెటా' సమర్థ అమలుపై చర్చలు కేంద్రీకృతమయ్యాయి. ఈ ఒప్పందంపై ముఖ్యంగా 'ఎంఎస్‌ఎంఈ'లలో మరింత అవగాహన కల్పించాలని ప్రతినిధులు చెప్పారు. అలాగే, నియంత్రణ విధానాలతోపాటు ధ్రువీకరణ అవసరాల సరళీకరణ, పరిశ్రమల మధ్య భాగస్వామ్యాల బలోపేతం, ఒప్పందం ద్వారా ఒనగూడే అవకాశాలను వ్యాపారాలు పూర్తిగా సద్వినియోగం చేసుకునేలా ప్రతిభావంతుల బదిలీ సౌలభ్యం తదితరాల ఆవశ్యకతను పరిశ్రమల ప్రతినిధులు ప్రముఖంగా ప్రస్తావించారు.

ఈ కార్యక్రమంలో భాగంగా శ్రీ పీయూష్ గోయల్ 4 విజ్ఞాన నివేదికలను ఆవిష్కరించారు. వీటిలో ఫిక్కి ప్రచురించిన 'ది ఎవాల్వింగ్ ఇండియా-యూకే పార్టనర్‌షిప్', సీఐఐ వారి 'ఇండియన్ రూట్స్-బ్రిటిష్ సాయిల్: చార్టింగ్ ఇండియన్ ఇండస్ట్రీస్ ఫుట్‌ప్రింట్స్ ఇన్ ది యూకే-2026', యూకేఐబీసీ-హెచ్ఎస్‌బీసీ యూకే-ఇండియా సెటా యుటిలైజేషన్ మాన్యువల్', కేర్‌ఎడ్జ్ వారి 'సావరిన్ రేటింగ్స్ - ఎ ఫ్రెష్ పర్స్పెక్టివ్' ఉన్నాయి. 'సెటా' కింద అవకాశాలను సమర్థంగా వాడుకోవడానికి, వాణిజ్యరంగానికి అవగాహన-ఆచరణాత్మక మార్గదర్శకత్వం లక్ష్యంగా ఈ నివేదికలు రూపొందాయి.

ఈ సదస్సులో భాగంగా ఆరోగ్య సంరక్షణ, ఆధునిక తయారీ, కాలుష్య రహిత ఇంధనం, సైన్స్-టెక్నాలజీ, సేవలు, వినియోగ వస్తు రంగాల సంబంధిత రౌండ్‌టేబుల్ చర్చల సిఫారసులను పరిశ్రమ ప్రతినిధులు వివరించారు. ఆవిష్కరణ, పెట్టుబడి, బలమైన వ్యాపార భాగస్వామ్యాల ద్వారా ద్వైపాక్షిక సహకార విస్తరణకు గల అవకాశాలను ఈ సిఫారసులు ప్రధానంగా పేర్కొన్నాయి.

సదస్సు ముగిసిన తర్వాత భారత వ్యాపార ప్రతినిధి బృందంతో ఒక సంక్షిప్త పరస్పర గోష్ఠి కార్యక్రమాన్ని శ్రీ పీయూష్ గోయల్ నిర్వహించారు. దీంతో యునైటెడ్ కింగ్‌డమ్‌లో రెండు రోజుల పాటు సాగిన వాణిజ్య సమావేశాలు సమాప్తమయ్యాయి. ప్రతినిధి బృందంలోని సభ్యులు తమతమ సమావేశాల ద్వారా గ్రహించిన కీలకాంశాలతోపాటు భవిష్యత్ భాగస్వాములతో సంభాషణలు. వివిధ రంగాల్లో తాము గుర్తించిన వ్యాపార అవకాశాల గురించి సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకున్నారు.

భారత్-యూకే సమగ్ర ఆర్థిక-వాణిజ్య ఒప్పందానికిగల బలమైన సామర్థ్యాన్ని ఈ సమావేశాలు పునరుద్ఘాటించాయి. అలాగే, దీన్ని విస్పష్ట వాణిజ్య, పెట్టుబడి మార్గంగా మలచడంలో రెండు దేశాల ప్రభుత్వాలు, పరిశ్రమల సంయుక్త నిబద్ధతను ప్రకటించాయి.

# "నా గమ్యం ఐఏఎస్" పుస్తక రచయితకు సన్మానం..




కరీంనగర్, జూన్ 29:భారతరత్న మాజీ ప్రధానమంత్రి శ్రీ పీవీ నరసింహారావు 105వ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించిన కార్యక్రమంలో "నా గమ్యం ఐఏఎస్" పుస్తక రచయిత శ్రీ నా రోజు శంకరాచారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పీవీ చారిటబుల్ ట్రస్ట్ సీఈవో డాక్టర్ ఎన్.వి. సుధాకిరణ్ మాట్లాడుతూ, తెలుగు భాషలో సివిల్ సర్వీసుల సాధనకు అవసరమైన మార్గదర్శకత్వాన్ని అందించే విధంగా ఈ పుస్తకాన్ని రచించడం విశేషమని కొనియాడారు. ఉభయ తెలుగు రాష్ట్రాల విద్యార్థులకు ఉపయోగపడేలా సివిల్స్ సిద్ధత, అధ్యయన విధానం, చదవాల్సిన పుస్తకాలు వంటి అనేక ముఖ్యాంశాలను స్పష్టంగా వివరించారని పేర్కొన్నారు.

తెలుగు భాషలో పూర్తిస్థాయిలో రూపొందించిన ఈ పుస్తకం విద్యార్థులకు మార్గదర్శకంగా నిలుస్తుందని, దీన్ని చదివి అర్థం చేసుకొని తమ భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకోవాలని సూచించారు. తెలుగు ప్రజలందరికీ గర్వకారణమైన ఈ కృషిని అభినందిస్తూ, పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా రచయితను సత్కరించడం ప్రత్యేకతను సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో పుస్తక ఆవిష్కరణతో పాటు పలువురు విద్యావేత్తలు, మేధావులు పాల్గొని రచయితకు అభినందనలు తెలిపారు. పీవీ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు, హైకోర్టు అడ్వకేట్ ఎడపల్లి హరీష్, అపర్ణ ఫౌండేషన్ చైర్మన్, ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియలో ఇంటింటికీ బీఆర్ఎస్ నేతలు..

## -ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ
## -ఓటరు జాబితా సవరణను విజయవంతం చేయాలని ప్రజలకు విజ్ఞప్తి



నిజామాబాద్, జూన్ 29: కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు చేపట్టిన ఎస్ఐఆర్ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ నెలరోజుల పాటు కొనసాగనున్న నేపథ్యంలో అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని భీమ్‌గల్ తహసీల్దార్ కిరణ్‌కుమార్ సూచించారు.

మాజీ మంత్రి, బాల్కొండ నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం భీమ్‌గల్ మండలంలోని ముచ్కూర్ గ్రామం 201వ పోలింగ్ బూత్ పరిధిలో నిర్వహిస్తున్న సర్వే కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ కార్మిక శాఖ మండల అధ్యక్షుడు డీవీ గంగాధర్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సంబంధిత బీఎల్‌ఓతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేశారు. ప్రతి కుటుంబం తమ వివరాలను ఎలాంటి పొరపాట్లు లేకుండా పూర్తి స్థాయిలో నమోదు చేసి, బీఎల్‌ఓలకు అందజేయాలని ప్రజలకు సూచించారు.

ఈ సందర్భంగా డీవీ గంగాధర్ మాట్లాడుతూ.. కేంద్ర ఎన్నికల కమిషన్ చేపట్టిన ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను విజయవంతం చేయడానికి ప్రజలు పూర్తిగా సహకరించాలని కోరారు. సరైన వివరాలు నమోదు చేసి తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# ప్రతి పేద కుటుంబం సంతోషంగా ఉండటమే ప్రభుత్వ లక్ష్యం



నిజామాబాద్, జూన్ 29: ప్రతి పేద కుటుంబం సంతోషంగా ఉండాలన్నదే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని బిక్కనూర్ పట్టణ సర్పంచ్ రేఖా సుదర్శన్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లను ఆమె లబ్ధిదారులతో కలిసి ప్రారంభించారు.

అనంతరం రేఖా సుదర్శన్ మాట్లాడుతూ.. ఇండ్లు లేని నిరుపేదలందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తుందని గుర్తు చేశారు. మంజూరైన లబ్ధిదారులు సకాలంలో తమ ఇంటి నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని ఆమె సూచించారు. అన్ని వర్గాల సంక్షేమానికి ప్రస్తుత ప్రభుత్వం ఎన్నో పథకాలను ప్రవేశపెడుతుండగా, గత ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని ఆమె ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పట్టణ సొసైటీ అధ్యక్షులు భూమయ్య, ఉపసర్పంచ్ మోహన్ రెడ్డి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు రవి, మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సుదర్శన్, పార్టీ నాయకులు మైపాల్ రెడ్డి, ఉప్పరి సాయిలు తదితరులు పాల్గొన్నారు.

# జింకల దాడులతో పంటలకు ముప్పు..

-రైతుల సమస్యలు వెంటనే పరిష్కరించాలంటూ వినతి
-జింకల బెడద నుంచి పంటలను కాపాడాలని అఖిల భారత ఐక్య రైతు కూలీ సంఘం డిమాండ్



మహబూబ్‌నగర్, జూన్ 29: పరిష్కరించాలని అఖిల భారత ఐక్య రైతు కూలీ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం నారాయణపేట జిల్లా ఊట్కూర్ తహసీల్దార్ అశోక్‌కుమార్‌కు సంఘం ఆధ్వర్యంలో వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు.

ఈ సందర్భంగా రైతు కూలీ సంఘం జిల్లా కమిటీ సభ్యుడు ఎల్కోటి చెన్నప్ప, మండల కార్యదర్శి అంజప్ప, ఏఐపీకేఎంఎస్ నాయకుడు సలీం మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెలరోజులు గడిచినా రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు సక్రమంగా అందడం లేదని ఆరోపించారు. అరకొర వర్షాలకు విత్తనాలు వేసిన రైతులు వర్షాభావ పరిస్థితులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

మండలంలోని పెద్దపొర్ల, కొల్లూరు, మల్లేపల్లి, యారఘాట్‌పల్లి తదితర గ్రామాల్లో జింకలు గుంపులుగా వచ్చి పత్తి, కంది పంటల మొలకలను నాశనం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వర్షాలు ఆలస్యంగా కురవడంతో ఖరీఫ్ సాగు కూడా ఆలస్యంగా ప్రారంభమైందని పేర్కొన్నారు.

రైతు యాప్ ద్వారా యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులు సకాలంలో అందడం లేదని, ఎరువుల కొనుగోలుకు అవసరమైన బ్యాంకు రుణాలను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువుల ధరలను తగ్గించి సబ్సిడీలను కొనసాగించాలని కోరారు.

రైతులకు ఇచ్చిన హామీ మేరకు పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)కు చట్టబద్ధత కల్పించాలని, రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయాలని, కొనుగోలు పరిమితులు విధించడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతారని పేర్కొన్నారు.

ఖరీఫ్ రైతు భరోసా సాయాన్ని ప్రభుత్వం ఇప్పటికీ విడుదల చేయలేదని, ఒకేసారి పూర్తి మొత్తాన్ని చెల్లించడంతో పాటు గత బకాయిలను కూడా వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గతంలో వరి పంటను విక్రయించిన రైతులకు కొనుగోలు బిల్లులు, బోనస్ చెల్లింపులు పూర్తిగా జరగలేదని, కొన్ని చోట్ల తీవ్ర జాప్యం జరుగుతోందని ఆరోపించారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలన్నింటినీ వెంటనే చెల్లించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల నాయకులు చిన్నబాలు, బాలకృష్ణ, నర్సింలు, రమేష్‌తో పాటు కొల్లూరు, పెద్దపొర్ల గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

# మధ్యప్రదేశ్ నుంచి యూఏఈకి జీఐ ట్యాగ్ పొందిన రేవా సుందర్జా మామిడి పండ్ల తొలి వాణిజ్య ఎగుమతిని పూర్తి చేసిన ఏపీఈడీఏ

న్యూఢిల్లీ, జూన్ 29:భారత ప్రభుత్వ వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ పరిధిలోని వ్యవసాయ, శుద్ధ ఆహార ఉత్పత్తుల ఎగుమతి అభివృద్ధి సంస్థ (ఏపీఈడీఏ), మధ్యప్రదేశ్‌కు చెందిన దేవా సుందర్జా మామిడి పండ్లను యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)కి ఎగుమతి చేసింది. భౌగోళిక గుర్తింపు (జీఐ ట్యాగ్) పొందిన ఈ పండ్ల తొలి వాణిజ్యపరమైన విదేశీ ఎగుమతి ఇది.

ఈ మేలురకం రకం మామిడి పండ్లకు అంతర్జాతీయ మార్కెట్ కల్పించేందుకు ఏపీఈడీఏ గత కొన్ని నెలలుగా మధ్యప్రదేశ్ ప్రభుత్వ ఉద్యానవన శాఖ, ఎగుమతిదారులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, ప్యాక్ హౌస్ ఆపరేటర్లు, అంతర్జాతీయ కొనుగోలుదారులతో కలిసి సమన్వయంతో పనిచేసింది. ఈ సమష్టి కృషితో యూఏఈలో ఒక కొనుగోలుదారుని గుర్తించి, ఈ ప్రసిద్ధ రేవా సుందర్జా మామిడి అంతర్జాతీయ మార్కెటింగ్‌కు మార్గం సుగమం చేశారు.

మెసర్స్ సాల్ట్ రేంజ్ ఫుడ్స్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ ద్వారా 2026 జూన్ 26న ఒక మెట్రిక్ టన్ను రేవా సుందర్జా మామిడి పండ్లను యూఏఈకి రవాణా చేశారు. ఈ చారిత్రాత్మక రవాణా రేవా సుందర్జ మామిడి అంతర్జాతీయ ప్రయాణానికి నాంది పలికింది. రాబోయే రోజుల్లో మరిన్ని క్రమబద్ధమైన ఎగుమతులకు ఇది మార్గం సుగమం చేస్తుందని అధికారులు భావిస్తున్నారు.

ఈ తొలి విదేశీ ఎగుమతి సరుకు రవాణా కోసం మధ్యప్రదేశ్ రాష్ట్రం రేవా జిల్లాలోని గోవింద్‌గఢ్‌కు చెందిన మెసర్స్ సియోంధా ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్, అభ్యుదయ రైతు శ్రీ సోను గుప్తా నుంచి అత్యుత్తమ నాణ్యత గల రేవా సుందర్జా మామిడి పండ్లను సేకరించారు. నిర్ణీత నాణ్యతా ప్రమాణాల ప్రకారం సేకరించిన ఈ మామిడి పండ్లను ఉత్తరప్రదేశ్, భదోహిలోని అపెడా ఏపీఈడీఏ గుర్తింపు పొందిన త్రిసాగర్ ఫార్మర్ ప్రొడ్యూసర్ సంస్థ ప్యాక్ హౌస్‌లో గ్రేడింగ్, సార్టింగ్, అంతర్జాతీయ ప్రమాణాలతో ప్యాకేజింగ్ చేశారు. అనంతరం మొక్కల ఆరోగ్య ధ్రువీకరణ ప్రక్రియలను పూర్తి చేసి, వారణాసి విమానాశ్రయం ద్వారా విమాన మార్గంలో యూఏఈకి తరలించారు.

ఈ వాణిజ్య ఎగుమతి ద్వారా రేవా ప్రాంతంలోని మామిడి రైతులకు భారీ ఆర్థిక ప్రయోజనం చేకూరనుంది. స్థానిక మార్కెట్‌లో రేవా సుందర్జా మామిడి పండ్ల ప్రస్తుత ధర కిలోకు సుమారు రూ.100 నుంచి 110 ఉండగా.. ఎగుమతిదారు ఈ పంటకు కిలోకు రూ. 150 చొప్పున కొనుగోలు చేశారు. దీని ద్వారా రైతులకు కిలోకు రూ. 40 నుంచి 50 వరకు అదనపు లాభం లభించింది. రైతులను ఎగుమతి ఆధారిత విలువ వ్యవస్థలతో అనుసంధానించడం వల్ల కలిగే ఆర్థిక ప్రయోజనాలకు ఈ ముందడుగు ఒక నిదర్శనం. ఇది మరింత మంది రైతులను నాణ్యమైన పంట దిగుబడి, అత్యాధునిక ప్యాకేజింగ్ పద్ధతులు అవలంబించేలా ప్రోత్సహిస్తుంది. అలాగే అంతర్జాతీయ మార్కెట్లకు వారి అందుబాటును విస్తరిస్తుందని కూడా భావిస్తున్నారు.

అంతర్జాతీయ మార్కెట్లలో ప్రాంతీయ వ్యవసాయ ఉత్పత్తులకు ప్రత్యేక గుర్తింపు తీసుకురావడంలో భౌగోళిక గుర్తింపు ఎంత కీలక పాత్ర పోషిస్తుందో ఈ విజయం మరోసారి నిరూపించింది.

అద్భుతమైన తీపి, గొప్ప సువాసన, పీచు లేని గుజ్జు, విలక్షణమైన రుచికి రేవా సుందర్జా మామిడి ఎంతో ప్రసిద్ధి చెందింది. అందుకే దీనికి అంతర్జాతీయంగా భారీ ఎగుమతి అవకాశాలు ఉన్నాయి. ఈ వాణిజ్య ఎగుమతి ద్వారా ఈ స్వదేశీ మామిడి రకానికి ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పెరగడమే కాకుండా, అత్యుత్తమ నాణ్యత కలిగిన మామిడి ఎగుమతులకు మధ్యప్రదేశ్ ఒక ముఖ్యమైన కేంద్రంగా ఎదిగేందుకు మార్గం సుగమమైంది.

యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కి రేవా సుందర్జా మామిడి పండ్ల తొలి వాణిజ్య ఎగుమతిని పురస్కరించుకుని 2026 జూన్ 26న ఒక అధికారిక ప్రారంభోత్సవ వేడుకను నిర్వహించారు. మధ్యప్రదేశ్ నుంచి వ్యవసాయ ఎగుమతులను ప్రోత్సహించడంలో ఏపీఈడీఏ నిరంతర కృషికి ఈ కార్యక్రమం కీలకంగా నిలిచింది. అలాగే ఏపీఈడీఏ, మధ్యప్రదేశ్ ప్రభుత్వ ఉద్యానవన శాఖ, ఎగుమతిదారులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, ప్యాక్ హౌస్ నిర్వాహకులు, రైతుల మధ్య విజయవంతమైన సమష్టి సహకారానికి ఇది అద్దం పట్టింది.ఎగుమతి మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం, అంతర్జాతీయ నాణ్యతా ప్రమాణాల పాటించేలా చూడటం, మార్కెట్ సంబంధాలను పెంపొందించడం, ప్రపంచవ్యాప్తంగా భారతదేశ వ్యవసాయ ఉత్పత్తులను ప్రోత్సహించడం ద్వారా జీఐ-ట్యాగ్ గల, విలువ ఆధారిత వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులను సులభతరం చేయడంలో ఏపీఈడీఏ కీలక పాత్రను కొనసాగిస్తోంది. రేవా సుందర్జా మామిడి పండ్ల వాణిజ్య ఎగుమతుల విజయవంతమైన ప్రారంభం భారత్ నుంచిమరిన్ని జీఐ ఉత్పత్తులకు కొత్త అవకాశాలను సృష్టిస్తుందని, వ్యవసాయ ఎగుమతి వ్యవస్థను బలోపేతం చేస్తుందని, రేవా ప్రాంతంలోని మామిడి రైతులకు స్థిరమైన ఆదాయ వృద్ధికి దోహదపడుతుందని భావిస్తున్నారు.

# గురుకుల హాస్టల్ భవనంపై నుంచి పడి విద్యార్థినికి తీవ్ర గాయాలు



మహబూబ్‌నగర్, జూన్ 29: వికారాబాద్ జిల్లా తాండూరు మండలం జినుగుర్తి గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో ఆదివారం అర్ధరాత్రి ఓ విద్యార్థిని అనుమానాస్పద స్థితిలో హాస్టల్ రెండో అంతస్తు నుంచి కిందపడిపోయింది. మైల్వార్ గ్రామానికి చెందిన మహేశ్వరి అనే విద్యార్థిని ఇక్కడ ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతోంది. భవనంపై నుంచి కింద పడటంతో బాలికకు రెండు కాళ్లు విరిగిపోగా, వెన్నెముకకు తీవ్ర గాయాలయ్యాయి.

గమనించిన సిబ్బంది వెంటనే ఆమెను తాండూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి రిఫర్ చేశారు. కాగా, ఈ ఘటన గురుకుల పాఠశాలలో తీవ్ర కలకలం రేపింది. మహేశ్వరి అసలు ఎలా కిందపడింది? దీని వెనుక కారణాలేంటనే దానిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు కోరగా, ఉన్నతాధికారులు సైతం విచారణకు ఆదేశించినట్లు సమాచారం.

# సహకార బ్యాంకుల బలోపేతానికి డిపాజిట్ల పెంపే కీలకం



చిత్తూరు, జూన్ 29: సహకార బ్యాంకులు ఆర్థికంగా మరింత బలోపేతం కావాలంటే డిపాజిట్ల సేకరణపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా సహకార వారోత్సవాల సందర్భంగా సోమవారం చిత్తూరులోని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన డీసీసీబీ చైర్మన్ అమాస రాజశేఖర్ రెడ్డి, జిల్లా సహకార అధికారి శ్రీలక్ష్మి, బ్యాంకు మేనేజర్లు, సహకార సంఘాల అధ్యక్షులు, బోర్డు సభ్యులతో కలిసి మొబైల్ ఏటీఎం వాహనాలను ప్రారంభించారు. అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి మొక్కలు నాటారు. జిల్లాలో సహకార రంగ అభివృద్ధి, రైతులకు రుణాల కల్పన, డిపాజిట్ల పెంపు, రుణాల వసూళ్లు, నిరర్థక ఆస్తుల నియంత్రణ వంటి అంశాలపై సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని బ్యాంకులు సేకరించిన మొత్తం డిపాజిట్లలో డీసీసీబీ వాటా కేవలం 3.20 శాతం మాత్రమే ఉండగా, రుణాల పంపిణీలో 5.25 శాతం వాటాను కలిగి ఉందన్నారు. ఈ పరిస్థితుల్లో రుణాల కోసం రాష్ట్ర సహకార బ్యాంకు, నాబార్డ్ వంటి సంస్థలపై అధికంగా ఆధారపడాల్సి వస్తోందని తెలిపారు. డిపాజిట్లు పెరిగితే బ్యాంకు స్వంత నిధులు బలోపేతమై రైతులకు అవసరమైన సమయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా తక్షణ రుణాలు అందించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. సహకార బ్యాంకులపై ప్రజల విశ్వాసాన్ని పెంపొందించేందుకు పారదర్శకత, క్రమశిక్షణతో పనిచేయాలని, డిపాజిట్ల సేకరణలో ప్రజాప్రతినిధులు, సహకార సంఘాల ప్రతినిధులు, అధికారులు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు.

గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు సహకార బ్యాంకులు వెన్నెముకలాంటివని, రైతులు, చిన్న వ్యాపారులు, స్వయం ఉపాధి పొందుతున్న వారికి సకాలంలో రుణాలు అందిస్తూ వారి ఆర్థికాభివృద్ధికి కీలక పాత్ర పోషిస్తున్నాయని చెప్పారు. రుణాల మంజూరు, వసూళ్లు, నిరర్థక ఆస్తుల నియంత్రణపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని కలెక్టర్ ఆదేశించారు. వ్యవస్థ బలోపేతమైతేనే బ్యాంకులపై ప్రజల నమ్మకం పెరుగుతుం దని, సహకార బ్యాంకులు బలప డితే రైతాంగానికి మరింత మెరుగైన సేవలు అందించగలవని పేర్కొన్నారు. చిత్తూరు జిల్లాలో సుమారు 3 లక్షల కుటుంబాలు సహకార రంగం ద్వారా లభిస్తున్న రుణాలపై ఆధారపడి జీవనోపాధి సాగిస్తున్నందున ఈ వ్యవస్థను మరింత పటిష్ఠం చేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వంతో పాటు జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. అనంతరం "సహకారంతో సమృద్ధి" లక్ష్యాన్ని సాధించేందుకు సహకార రంగ అభివృద్ధికి కృషి చేస్తామని అధికారులు, ఉద్యోగులు, సహకార సంఘాల ప్రతినిధులతో కలసి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో జిల్లాలోని 71 సహకార సంఘాలకు రూ.3,50,95,151 డివిడెండ్ మొత్తానికి సంబంధించిన చెక్కులను కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో నాబార్డ్ జిల్లా అభివృద్ధి అధికారి చంద్రశేఖర్, డీసీసీబీ సీఈఓ శంకర్ బాబు, సురేష్ బాబు, బ్యాంకు అధికారులు, బోర్డు సభ్యులు, సహకార సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# పేద ప్రజల సంక్షేమానికి పెద్దపీట: ఎమ్మెల్యే కడియం శ్రీహరి



వరంగల్, జూన్ 29:జనగామ జిల్లా స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో ఎలాంటి అవినీతికి ఆస్కారం లేకుండా ప్రభుత్వ పథకాల అమలు జరగాలని స్థానిక ఎమ్మెల్యే, మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి తెలిపారు. ధర్మసాగర్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ మరియు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ధర్మసాగర్ మండలానికి చెందిన 26 మంది కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు రూ.26,03,016 విలువగల చెక్కులను, అలాగే 39 మంది ముఖ్యమంత్రి సహాయ నిధి (అంఖీఈ) లబ్ధిదారులకు రూ.14,25,000 విలువైన చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. వీటితో పాటు ధర్మసాగర్ కేంద్రానికి చెందిన భూక్య వసంత అనే మహిళ అనారోగ్య ఖర్చుల నిమిత్తం రూ.2,50,000 విలువైన ఎల్ఓసీ పత్రాన్ని, ముప్పారం గ్రామంలో రెండు అంగన్‌వాడీ భవనాల నిర్మాణ మంజూరు పత్రాన్ని స్థానిక సర్పంచ్‌కు అందజేశారు.

అనంతరం కడియం శ్రీహరి మాట్లాడుతూ.. పేదింటి ఆడపిల్లల పెళ్లిళ్లకు కల్యాణ లక్ష్మి పథకం ద్వారా అందుతున్న రూ.1,00,116 ఆర్థిక సహాయం తల్లిదండ్రులకు కొండంత భరోసానిస్తోందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ రెండు సంవత్సరాల కాలంలో రైతు, మహిళా, పేద వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని పేర్కొన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్నబియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్లు వంటి పథకాలను ప్రభుత్వం విజయవంతంగా అమలు చేస్తోందని తెలిపారు.

రాష్ట్రంపై అప్పుల భారం ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని కొనియాడారు. కల్యాణ లక్ష్మి లబ్ధిదారులు పెళ్లి కాగానే దరఖాస్తు చేసుకోవాలని, అధికారుల నుంచి మూడు నెలల్లో ప్రక్రియ పూర్తి కావాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్లు, కల్యాణ లక్ష్మి, సీఎంఆర్ఎఫ్ వంటి ఏ పథకానికైనా ఎవరికీ ఒక్క రూపాయి కూడా లంచం ఇవ్వాల్సిన అవసరం లేదని, దళారులను నమ్మవద్దని స్పష్టం చేశారు. విధుల్లో అవినీతికి పాల్పడే అధికారులను సహించేది లేదని హెచ్చరించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే అత్యధిక నిధులతో స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్, ఎంపీడీవో, సర్పంచులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ఈ ఏడాది వర్షాలు సకాలంలో సమృద్ధిగా కురియాలి

అమరావతి, జూన్ 29: ఈ ఏడాది వర్షాలు సకాలంలో సమృద్ధిగా కురిసి రైతు సోదరుల ఇంట ధాన్యరాశులు నిండాలని నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ ఆకాంక్షించారు. సోమవారం ఏరువాక పౌర్ణమి వేడుకలు చల్లపల్లి మండలం యార్లగడ్డలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మండలి వెంకట్రామ్ విచ్చేసి జోడెడ్లకు పూజలు చేసి పొలం దున్ని, వరి విత్తనాలు చల్లి వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్నదాత ? సుఖీభవ అంటూ కూటమి ప్రభుత్వం అందిస్తున్న అండదండలతో రైతు సోదరులు ఆర్థికంగా బలోపేతం కావాలని, ఆంధ్ర రాష్ట్రం అన్నపూర్ణగా వర్ధిల్లాలని కోరుకున్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, చల్లపల్లి పీఏసీఎస్ చైర్మన్ బొందలపాటి వీరబాబు, మాజీ సర్పంచులు పరుచూరి సురేష్, బొబ్బా కృష్ణారావు, ఏఓ కే.మురళీకృష్ణ, రైతు పెద్దలు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# వటసావిత్రి పూజల్లో ప్లకార్డులతో మహిళల నిరసన

నల్గొండ, జూన్ 29:మహాలక్ష్మి పథకం కింద ఆడబిడ్డలకు నెలకు రూ.2,500 మరియు తులం బంగారం హామీలను అమలు చేయాలంటూ ఇచ్చోడ మండలంలోని ముఖరా (కే) గ్రామ మహిళలు వినూత్న నిరసన చేపట్టారు. వటసావిత్రి పౌర్ణమి సందర్భంగా సోమవారం వటవృక్షానికి పూజలు చేసిన మహిళలు.. చేతుల్లో ప్లకార్డులు పట్టుకుని కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంచి బుద్ధి ప్రసాదించాలని మొక్కుతూ పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే 6 గ్యారంటీల కింద ప్రతి మహిళకు నెలకు రూ.2,500, పెళ్లయిన ఆడబిడ్డకు తులం బంగారం ఇస్తామని నమ్మించి అధికారంలోకి వచ్చిందన్నారు. ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఇది మూడవ వటసావిత్రి పౌర్ణమి వస్తున్నా ఇప్పటివరకు ఈ హామీలు నెరవేర్చకుండా మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే మహాలక్ష్మి పథకం నిధులను విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గాడ్గే మీనాక్షి, ఇందుబాయి, కూసుమబాయి, శారదా, లక్ష్మి తదితర మహిళలు పాల్గొన్నారు.

# విద్యా అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి: పీఓ మంద మకరంద



మహబూబ్‌నగర్, జూన్ 29: 'గిరి విద్య' కార్యక్రమంలో భాగంగా గిరిజన విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్యా, ఉద్యోగ శిక్షణ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి (పీఓ) మంద మకరంద కోరారు. గిరి విద్య ప్రోగ్రామ్‌లో భాగంగా ఆశ్రమ గురుకులాల్లో చదువుతూ ఉచిత ఐఐటీ జేఈఈ కోచింగ్, ఎంపీసీ హాస్టల్ వసతి కోసం ఎంపికైన 10 మంది గిరిజన విద్యార్థులను హైదరాబాద్‌లోని మాడ్యులస్ కళాశాలకు పంపేందుకు ఐటీడీఏ ప్రత్యేక బస్సును ఏర్పాటు చేసింది. సోమవారం ఐటీడీఏ కార్యాలయం ముందు ఈ బస్సును పీఓ జెండా ఊపి ప్రారంభించి, విద్యార్థులను సాగనంపారు.

అంతకుముందు అధికారులు, విద్యార్థుల తల్లిదండ్రులతో పీఓ మాట్లాడుతూ.. క్రమశిక్షణ, కష్టపడే తత్వం, ఆత్మవిశ్వాసంతో చదివి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య, పోటీ పరీక్షలకు మెరుగైన శిక్షణ అందించడమే గిరి విద్య లక్ష్యమని, విద్యార్థులంతా రాణించి తమ కుటుంబానికి, ఐటీడీఏకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ డీడీ ప్రేమకళ, ఏపీఓ (పీవీటీజీ) ఆత్రం భాస్కర్, డిప్యూటీ డీఈఓ చందన్, ఏసీఎంఓ జగన్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# చత్రపతి ఆరాకటిక యువజన సంఘం నూతన కమిటీ ఎన్నిక..

మహబూబ్‌నగర్, జూన్ 29: నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండల కేంద్రంలోని చత్రపతి ఆరాకటిక యువజన సంఘం నూతన కమిటీ సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఊట్కూర్ చత్రపతి ఆరకటిక యువజన సంఘం అధ్యక్షులుగా డీకే ఉపేందర్ జీ, ఉపాధ్యక్షులుగా డీకే రవిరోషాజీ, కోశాధికారిగా డీకే అరవింద్, సహాయ కోశాధికారిగా ఎం. రాజేష్, సోషల్ మీడియా ఇన్చార్జిగా జెకె అరుణ్, ప్రధాన కార్యదర్శిగా ఎం. రోషజీ, డీకే ఉదయ్, విద్యార్థి శక్తి ఎం. నందు, సలహాలు దారులుగా డీకే ఆనంద్, ఎం భాస్కర్ తదితరులను ఎన్నుకున్నట్లుతెలిపారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు డీకే ఉపేందర్ జీ మాట్లాడుతూ చత్రపతి అరకటిక సంఘం సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యలపై పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న వివిధ పథకాలలో తమ సంఘానికి ప్రాధాన్యత కల్పించి ఆదుకోవాలని కోరారు.

# గుజరాత్‌లో భారత్ టాక్సీ సేవలు ప్రారంభం

న్యూఢిల్లీ, జూన్ 29:గుజరాత్‌లోని గాంధీనగర్‌లో గల మహాత్మా మందిర్ కన్వెన్షన్, ఎగ్జిబిషన్ సెంటర్ నుంచి సహకార ఆధారిత రవాణా వేదిక 'భారత్ టాక్సీ'ని కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా ఈరోజు ప్రారంభించారు. టాక్సీ, ఆటో, ద్విచక్ర వాహనాల రవాణా సేవలలో ఉన్న సారథులకు యాజమాన్య వాటా, ఆత్మగౌరవం, భద్రత, ఆదాయాన్ని కల్పించడంతో పాటు ప్రజలకు నమ్మకమైన, సేవా దృక్పథంతో కూడిన రవాణా సౌకర్యాలను అందించడమే లక్ష్యంగా భారత్ టాక్సీ సేవలం దిస్తుంది. ఈ కార్యక్రమంలో గుజరాత్ ముఖ్యమంత్రి శ్రీ భూపేంద్రభాయ్ పటేల్, ఉప ముఖ్యమంత్రి శ్రీ హర్ష్ సంఘ్వీ, గుజరాత్ సహకార శాఖ మంత్రి శ్రీ జితుభాయ్ వాఘాని, గుజరాత్ సహకార శాఖ సహాయ మంత్రి శ్రీ రమేష్‌భాయ్ కటారా, కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ కార్యదర్శి డాక్టర్ ఆశిష్ కుమార్ భుతానీ, గుజరాత్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ మనోజ్ దాస్, భారత్ టాక్సీ చైర్మన్ డాక్టర్ జయెన్ మెహతాతో పాటు సహకార రంగ ప్రముఖులు, ఉన్నతాధికారులు, భారీ సంఖ్యలో సారథులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా మాట్లాడుతూ, భారత రవాణా రంగానికి ఈ రోజు అత్యంత కీలకమైన రోజు అని అన్నారు. దేశం అభివృద్ధి చెందుతున్న కొద్దీ, టాక్సీ, రవాణా సేవల అవసరం ప్రతి ఇంటికీ చేరిందని ఆయన పేర్కొన్నారు. టాక్సీ అనే భావన ఇకపై కేవలం నాలుగు చక్రాల వాహనాలకే పరిమితం కాబోదని, ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ఇతర పట్టణ రవాణా సేవలు కూడా ఇప్పుడు అందులో భాగమయ్యాయని వివరించారు. గుజరాత్‌లో 'భారత్ టాక్సీ' ని ప్రారంభించడం విస్తరిస్తున్న రవాణా అవసరాలకు సహకార రంగం ద్వారా ఒక కొత్త దిశను చూపించే మార్గమని పేర్కొన్నారు.

వాహనాలు నడిపే వారిని ఇతర కంపెనీలు కేవలం డ్రైవర్లుగానే పరిగణిసాయని, కానీ 'భారత్ టాక్సీ' వారిని 'సారథులు'గా గుర్తిస్తుందని శ్రీ అమిత్ షా అన్నారు. ఇది కేవలం పదాల మధ్య ఉన్న వ్యత్యాసం మాత్రమే కాదని, వారి పట్ల దృక్పథంలోనే పూర్తి తేడా అని ఆయన పేర్కొన్నారు. ఒక 'సారథి' అనే వ్యక్తి కేవలం సేవలను అందించేవాడు మాత్రమే కాదని, ఈ సహకార సంస్థలో గౌరవప్రదమైన భాగస్వామి, యజమానీ అని స్పష్టం చేశారు. సారథులు, వినియోగదారులు ఇద్దరూ దోపిడీకి గురికాకుండా నిరోధించడం, సేవల నాణ్యతను మెరుగుపరచడం, రవాణా రంగంలో ఒక న్యాయబద్ధమైన వ్యవస్థను నెలకొల్పడమే 'భారత్ టాక్సీ' ప్రధాన ఉద్దేశమని వివరించారు.

గత కొన్ని సంవత్సరాలుగా యాప్ ఆధారిత టాక్సీ సేవలపై అనేక ఫిర్యాదులు వచ్చాయని కేంద్రమంత్రి పేర్కొన్నారు. కొన్ని సందర్భాల్లో సారథుల సంపాదన నుంచి మితిమీరిన కమిషన్ కట్ చేసుకున్నారనీ, మరికొన్ని సందర్భాల్లో వారికి రావలసిన చెల్లింపులు సమయానికి అందలేదనీ, అలాగే కొన్ని కేసుల్లో వారికి కనీసం వివరణ ఇచ్చుకునే అవకాశం కూడా ఇవ్వకుండా రిజిస్ట్రేషన్లను రద్దు చేశారనీ ఆయన వివరించారు. ప్రతి సమస్యకూ చట్టాలు చేయడం ద్వారానే పరిష్కారం లభించదనీ, చాలా సార్లు సరైన సంస్థాగత నమూనా మాత్రమే శాశ్వత పరిష్కారాన్ని అందిస్తుందనీ ఆయన అన్నారు. ఈ ఆలోచనతోనే సహకార నమూనాపై 'భారత్ టాక్సీ' భావన రూపుదిద్దుకుందని పేర్కొన్నారు.

దేశంలోని అనేక రంగాలలో దోపిడీకి సహకార వ్యవస్థ ముగింపు పలికిందనీ, ప్రజలకు హక్కులను, ఆర్థిక సమృద్ధిని చేకూర్చిందనీ శ్రీ అమిత్ షా అన్నారు. అమూల్ సంస్థను ఉదాహరణగా పేర్కొంటూ... కేవలం రూ. 100 వాటాతో సహకార వ్యవస్థలో చేరిన ఒక గ్రామీణ పశుపోషక మహిళ, ఈరోజు రూ. 1.25 లక్షల కోట్ల టర్నోవర్ కలిగిన అత్యంత విశ్వసనీయమైన ఒక ఫుడ్ బ్రాండ్‌లో భాగస్వామిగా నిలిచిందని ఆయన వివరించారు. మధ్యవర్తులు లేకుండా, ఎలాంటి దోపిడీకి తావులేకుండా, పూర్తి పారదర్శకతతో సహకార రంగం ద్వారానే ఒక భారీ ఆర్థిక వ్యవస్థను నిర్మించవచ్చని అమూల్ నిరూపించిందని ఆయన స్పష్టం చేశారు. ఈ నమూనా పాడి రంగంలో దోపిడీకి ముగింపు పలికిందనీ, పశువులను పోషించే మహిళలు కష్టపడి సంపాదించిన ఆదాయం నేరుగా వారి బ్యాంక్ ఖాతాల్లోకి చేరేలా చూసిందనీ పేర్కొన్నారు. నేడు గ్రామీణ భారతదేశంలోని పశుపోషక మహిళలు తమ శ్రమకు తగ్గ పూర్తి ఫలితాన్ని ఆత్మగౌరవంతో అందుకుంటున్నారని ఆయన అన్నారు. ఇదే విధంగా, ఇఫ్కో, క్రిభ్కో వంటి సహకార సంస్థలు నేడు దేశంలోని రైతుల ఎరువుల అవసరాలలో దాదాపు 35 శాతాన్ని తీరుస్తున్నాయని ఆయన వివరించారు. ఇది కూడా సహకార రంగంలో ఒక అతిపెద్ద విజయగాథ అని కొనియాడారు. రవాణా రంగంలో కూడా ఈ విజయవంతమైన సహకార సంప్రదాయాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు చేసిన ప్రయత్నమే 'భారత్ టాక్సీ' అని పేర్కొన్నారు. అయితే, భారత్ టాక్సీ వంటి కార్యక్రమానికి అవసరమైన వనరులు ఎక్కడి నుంచి వస్తాయనే ప్రశ్నను చాలా మంది లేవనెత్తారని అంటూ, ఈ విషయమై దేశంలోని ప్రముఖ సహకార సంస్థలతో చర్చలు జరిగాయని, ఈ కీలకమైన చొరవలో భాగస్వాములు కావాలని వాటిని కోరామని వివరించారు. దేశంలోని పెద్ద పెద్ద ప్రైవేట్ కంపెనీల ముందర ఒక బలమైన, పారదర్శకమైన, సారథులకు ప్రాధాన్యతనిచ్చే సహకార ప్రత్యామ్నాయాన్ని నిలబెట్టేందుకు ఎన్సీడీసీ, ఇఫ్కో, క్రిభ్కో, ఎన్‌డీడీబీ, నాబార్డ్, ఎన్‌సీఈఎల్, అమూల్ వంటి ప్రతిష్ఠాత్మక సహకార సంస్థలన్నీ కలిసి రవాణా రంగంలో ఈ సారథుల స్వంత సహకార సంస్థను నిర్మించాలని నిర్ణయించడం ఎంతో సంతోషంకరమైన విషయమని ఆయన పేర్కొన్నారు.

ఇప్పటివరకు 7 లక్షలమందికి పైగా సారథులు భారత్ టాక్సీలో చేరారని కేంద్రమంత్రి తెలిపారు. సారథులకు ఆత్మగౌరవాన్ని, భద్రతను ఇవ్వడమే కాకుండా రాబోయే రోజుల్లో వారి ఆర్థిక సమృద్ధికి భారత్ టాక్సీ మార్గం సుగమం చేస్తుందని ఆయన అన్నారు. ఈ సహకార సంస్థ సారథుల సంపాదనను రక్షించడంతో పాటు భవిష్యత్తులో వారికి రుణాలు, భీమా, వారి వ్యాపార విస్తరణలోనూ కూడా అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఇప్పటి వరకు దాదాపు 37 లక్షల మంది వినియోగదారులు భారత్ టాక్సీ సేవలను వినియోగించుకున్నారని, దీని పెరుగుతున్న ప్రజాదరణకు, నమ్మకానికి ఇదే స్పష్టమైన నిదర్శనమని ఆయన వివరించారు.

భారత్ టాక్సీ ఛార్జీలు ఎక్కువగా ఉన్నట్లు కొన్ని వార్తాపత్రికలు కథనాలు ప్రచురించడాన్ని శ్రీ అమిత్ షా ప్రస్తావిస్తూ, "భారత్ టాక్సీని అడ్డుకోడానికి అది విస్తరిస్తున్న ప్రతి చోటా, తోటి పోటీ కంపెనీలు నష్టాలను భరిస్తూ తాత్కాలికంగా మాత్రమే తమ ఛార్జీలను తగ్గిస్తున్నాయని వినియోగదారులు గుర్తించాలి. కానీ ఈ పరిస్థితి ఎంతో కాలం ఉండదు. మహా అయితే ఒకటి లేదా రెండేళ్లు మాత్రమే" అని అన్నారు. అయితే భారత్ టాక్సీ ఎప్పటికీ అలసిపోదని, వెనక్కి తగ్గదని, రంగం నుంచి తప్పుకోదని తాను పూర్తి నమ్మకంతో చెప్పాలనుకుంటున్నానని ఆయన అన్నారు. సేవా భావంతో, సహకార స్ఫూర్తితో భారత్ టాక్సీ మార్కెట్‌లో బలంగా నిలబడి, ఆరోగ్యకరమైన రీతిలో పోటీ పడుతుందని స్పష్టం చేశారు. ఎవరికీ నష్టం కలిగించడం తమ ఉద్దేశం కాదని, రవాణా రంగంలో ఒక న్యాయబద్ధమైన, పారదర్శకమైన, స్థిరమైన వ్యవస్థను నిర్మించడమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

నేడు ఛార్జీలను తగ్గించి, తాత్కాలికంగా సారథులకు ఎక్కువ కమిషన్ ఇస్తూ మార్కెట్‌లో ఒత్తిడిని సృష్టించడానికి ప్రయత్నిస్తున్న కంపెనీలు కేవలం భారత్ టాక్సీ పురోగతిని అడ్డుకోవడానికే అలా చేస్తున్నాయని కేంద్రమంత్రి పేర్కొన్నారు. భారత్ టాక్సీ ఈ రంగం నుంచి తప్పుకుంటే, తాము మళ్లీ పాత ఇష్టారాజ్య పద్ధతులను ప్రారంభించవచ్చని ఆ కంపెనీలు భావిస్తున్నాయని ఆయన అన్నారు. "కానీ నేను ఈ రోజు స్పష్టంగా చెప్పాలనుకుంటున్నాను, వారి కోరిక ఎప్పటికీ నెరవేరదు. సేవా సంకల్పం, సహకార బలం, సారథుల నమ్మకంతో భారత్ టాక్సీ నిరంతరం ముందుకు సాగుతూనే ఉంటుంది" అని ఆయన స్పష్టం చేశారు. వదంతులను వ్యాప్తి చేసేవారికి మన సహకార స్ఫూర్తి, మన నిరంతర కృషి, సేవా సమర్పణ భావమే సమాధానం చెబుతాయని ఆయన అన్నారు. భారత్ టాక్సీని విజయవంతం చేయడంలో అతిపెద్ద బాధ్యత మన సారథులపైనే ఉందన్నారు. కేవలం తక్షణ లాభాలను చూసుకుని మనం నిర్ణయాలు తీసుకుంటే రాబోయే సంవత్సరాల్లో మళ్లీ అదే దోపిడీని ఎదుర్కోవలసి వస్తుందనీ, అటువంటి పరిస్థితి నుంచి నుండి బయటపడడానికే భారత్ టాక్సీని స్థాపించామనీ ఆయన గుర్తుచేశారు.

సారథులు ఎన్నో ఏళ్లుగా వివిధ కంపెనీలలో పనిచేశారని, చాలా సందర్భాల్లో తమ వాదన వినకుండానే నిర్ణయాలు తీసుకోవడం, తమ సంపాదనను తగ్గించడం, తమ శ్రమకు పూర్తి గౌరవం ఇవ్వకపోవడాన్ని వారు స్వయంగా చూశారని శ్రీ అమిత్ షా పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన సారథులకు భరోసా ఇస్తూ, "భారత్ టాక్సీ మిమ్మల్ని ఎప్పటికీ దోపిడీ చేయదని నేను మీకు హామీ ఇస్తున్నాను, ఎందుకంటే ఇది ఎవరిదో పరాయి కంపెనీ కాదు, మీ సొంత సహకార సంస్థ" అని స్పష్టం చేశారు. నష్టాలను భరిస్తూ, అనారోగ్యకరమైన పోటీ ద్వారా భారత్ టాక్సీని మార్కెట్ నుంచి బయటకు నెట్టేయాలని కొన్ని కంపెనీలు ప్రయత్నిస్తున్నాయని ఆయన అన్నారు. ఇటువంటి వ్యూహాలు ప్రపంచంలోని కొన్ని దేశాల్లో పనిచేయవచ్చేమో కానీ, భారతదేశంలో మాత్రం సాగవనీ, భారతదేశ ఆత్మ సహకారం, సేవ, అందరి సంక్షేమంలోనే ఇమిడి ఉందని స్పష్టం చేశారు. ఇక్కడ కేవలం స్వార్థ ప్రయోజనాలకే కాకుండా, అందరి హితానికే అత్యున్నత ప్రాధాన్యత ఇస్తారని ఆయన పేర్కొన్నారు.

దీర్ఘకాలికమైన, నమ్మకమైన, న్యాయబద్ధమైన రవాణా వ్యవస్థ మనకు కావాలనుకుంటే భారత్ టాక్సీని విజయవంతం చేయడం మనందరి ఉమ్మడి బాధ్యత అని సారథులకు, వినియోగదారులకు శ్రీ అమిత్ షా విజ్ఞప్తి చేశారు. "భారత్ టాక్సీతోనే ఉండండి, భారత్ టాక్సీ ఎల్లప్పుడూ మీకు అండగా నిలుస్తుంది" అని ఆయన పిలుపునిచ్చారు. సహకార రంగంలో తాము ఇప్పటికే ఎన్నో విజయవంతమైన ఉదాహరణలను నిరూపించామని గుర్తుచేశారు. ఒకప్పుడు అమూల్ కూడా ప్రైవేట్ డెయిరీల నుంచి తీవ్రమైన పోటీని ఎదుర్కొందనీ, అలాగే ఇఫ్కో క్రిభ్కో ఎన్‌డీడీబీ సంస్థలు సైతం ప్రైవేట్ కంపెనీలతో పోటీ పడవలసి వచ్చిందనీ, అయితే ఈ సంస్థలన్నీ సహకారం, పారదర్శకత, ప్రజల నమ్మకం అనే బలంతోనే విజయం సాధించాయని ఆయన వివరించారు.

భారత్ టాక్సీ సారథుల సొంత సంస్థ అనీ, వారిపై జరిగే దోపిడీని అడ్డుకోవడానికీ, వారికి గౌరవాన్ని ఇవ్వడానికీ, వారిని ఆర్థికంగా సంపన్నులను చేయడానికీ దీనిని ఏర్పాటు చేశామని శ్రీ అమిత్ షా తెలిపారు. రాబోయే రోజుల్లో ఇదే సంస్థ వారికి రుణాలు అందించడంలోనూ , భీమా రక్షణ కల్పించడంలోనూ, వారి వ్యాపార విస్తరణకు మద్దతు ఇవ్వడంలోనూ తోడ్పడుతుందని వివరించారు. ఏ ప్రైవేట్ సంస్థా కూడా ఇలా చేయలేదని , వాటి లక్ష్యం కేవలం స్వంత లాభార్జనేనని, కానీ భారత్ టాక్సీ లక్ష్యం తన సారథుల సంక్షేమమేనని ఆయన స్పష్టం చేశారు. తక్షణ లాభాల కంటే... దీర్ఘకాలిక భద్రత, గౌరవం, స్థిరమైన ఆదాయానికే అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

పోటీ కంపెనీలు ఎన్ని నగరాలకని ఛార్జీలను తగ్గిస్తూ పోతాయని కేంద్రమంత్రి ప్రశ్నించారు. రాబోయే ఒకటిన్నర నుంచి రెండేళ్లలో భారత్ టాక్సీ 500కు పైగా నగరాలు, పట్టణాలకు విస్తరిస్తుందని ఆయన వెల్లడించారు. నాగ్‌పూర్, పూణే, ముంబయి, లక్నో, చండీగఢ్, జైపూర్, కోల్‌కతా సహా దేశంలోని పలు నగరాలకు భారత్ టాక్సీ తన సేవలను విస్తరించనుందని పేర్కొన్నారు. రాబోయే జూలై 31, 2026 నాటికి భారత్ టాక్సీ ఏడు ప్రధాన నగరాలకు చేరుకుంటుందని తెలిపారు. రాబోయే రెండేళ్లలో టూ-వీలర్స్ (ద్విచక్ర వాహనాలు), ఆటోలు, ఫోర్-వీలర్స్ అనే మూడు విభాగాలలోనూ దేశంలోని 500కు పైగా నగరాలు, పట్టణాలలో ఈ 'భారత్ టాక్సీ' నమూనాను అమలు చేయనున్నట్లు ఆయన వివరించారు.

గుజరాత్‌లో భారత్ టాక్సీ ప్రారంభం కావడం పట్ల శ్రీ అమిత్ షా హర్షం వ్యక్తం చేశారు. నేడు గుజరాత్ సారథులు ఏడు లక్షలమంది సభ్యులు గల ఒకే ఒక పెద్ద కుటుంబంలో భాగమయ్యారనీ, భారత్ టాక్సీలో చేరడం ద్వారా సహకార ఉద్యమానికి సరికొత్త బలాన్ని చేకూరుస్తున్నారనీ ఆయన కొనియాడారు. రాబోయే రోజుల్లో ఈ సహకార సంస్థ రవాణా రంగంలో సరికొత్త శిఖరాలను అధిరోహిస్తుందనీ, కచ్చితంగా విజయం సాధిస్తుందనీ తనకు పూర్తి నమ్మకం ఉందని స్పష్టం చేశారు. దేశంలోని కోట్ల మంది రైతులు అనుసంధానమై ఉన్న ఒకే విస్తృతమైన సహకార కుటుంబంలో నేడు వీరు భాగస్వాములయ్యారని, ఇప్పుడు గుజరాత్ సారథులు సైతం ఈ ప్రతిష్ఠాత్మక సహకార కుటుంబంలో ఒక అంతర్భాగంగా మారుతున్నారని ఆయన పేర్కొన్నారు.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దేశానికి 'సహకార్ సే సమృద్ధి' అనే మంత్రాన్ని అందించారని, రవాణా రంగంలో ఈ మంత్రాన్ని సాకారం చేసే దిశగా భారత్ టాక్సీ ఒక ముఖ్యమైన ముందడుగు అని ఆయన అభివర్ణించారు. రాబోయే రోజుల్లో సహకార రంగం మరిన్ని కొత్త రంగాలకు విస్తరిస్తుందనీ, సారథుల ఆత్మగౌరవానికీ, భద్రతకూ, వారి ఆదాయం పెంపునకూ భారత్ టాక్సీ ఒక బలమైన సాధనంగా మారుతుందని ఆయన స్పష్టం చేశారు.

గుజరాత్‌కు చెందిన భారత్ టాక్సీ సారథులందరికీ శ్రీ అమిత్ షా శుభాకాంక్షలు తెలియజేశారు. భారత్ టాక్సీ విజయం సేవా భావం, సహకార స్ఫూర్తి, సారథుల క్రియాశీల భాగస్వామ్యంపైనే ఆధారపడి ఉంటుందని ఆయన అన్నారు. భారత్ టాక్సీలో చేరడం ద్వారా సారథులు తమ ఆర్థిక సమృద్ధి, ఆత్మగౌరవం, సామాజిక భద్రత అనే మూడింటికీ బాటలు వేసుకున్నారని ఆయన పేర్కొన్నారు.

ఈ కార్యక్రమం సందర్భంగా, విస్తరణ సులభతర నిర్వహణ కోసం వివిధ సంస్థలతో భారత్ టాక్సీ అవగాహనా ఒప్పందాలను కూడా కుదుర్చుకుంది.

ఈ ఒప్పందాలు చేసుకున్న వాటిలో ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (రాజ్‌కోట్), ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సూరత్), గుజరాత్ మెట్రో రైల్ కార్పొరేషన్, అహ్మదాబాద్ మున్సిపల్ కార్పొరేషన్/బస్ రాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్, గుజరాత్ స్టేట్ కోఆపరేటివ్ బ్యాంక్, అదానీ ఎయిర్‌పోర్ట్, గుజరాత్ ట్రాఫిక్ పోలీస్, పశ్చిమ రైల్వే - అహ్మదాబాద్ డివిజన్, వడోదర ఎయిర్‌పోర్ట్ ఉన్నాయి. ఈ అవగాహనా ఒప్పందాలు విమానాశ్రయాలు, రైల్వేలు, మెట్రో, పట్టణ రవాణా, ట్రాఫిక్ నిర్వహణకు సంబంధించిన రంగాలలో భారత్ టాక్సీ సేవల విస్తృతిని మరింత బలోపేతం చేయనున్నాయి. ఈ కార్యక్రమం సందర్భంగా అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన సారథులకు షేర్ సర్టిఫికెట్లను కూడా పంపిణీ చేశారు.

# చంద్రబాబు అభివృద్ధికి బ్రాండ్ అంబాసిడర్

అమరావతి, జూన్ 29: ఆంధ్రప్రదేశ్ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సోమవారం అమరావతిలో మీడియాతో మాట్లాడుతూ వైఎస్సార్సీపీ అధినేత వైఎస్.జగన్మోహన్ రెడ్డిపై తీవ్ర విమర్శలు గుప్పించారు.

వైఎస్సార్సీపీ పాలనలో రాయలసీమలో హింసాత్మక ఘటనలు పెరిగాయని ఆరోపించిన మంత్రి, ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో రాయలసీమ అభివృద్ధి వేగంగా జరుగుతోందని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభివృద్ధికి బ్రాండ్ అంబాసిడర్‌గా నిలిచారని కొనియాడారు.

ప్రతిపక్ష హోదా కూడా లేని వారు ప్రభుత్వంపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. "రప్పా? రప్పా?" అని పిలిస్తే పారిశ్రామికవేత్తలు వస్తారా? అని ప్రశ్నించిన మంత్రి, గత ప్రభుత్వ హయాంలో ఉన్న పరిశ్రమలనే రాష్ట్రం నుంచి వెళ్లగొట్టారని ఆరోపించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో అనేక పరిశ్రమలు రాయలసీమకు వస్తున్నాయని, ఈ ప్రాంతాన్ని హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్సీపీకి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని, ఆ పార్టీకి డిపాజిట్లు కూడా దక్కవని మంత్రి బీసీ జనార్దనరెడ్డి వ్యాఖ్యానించారు.

# కొత్త తరహాలో బ్రాండ్ ప్రచారం..

# మల్టీవర్స్ కమ్యూనికేషన్ ఏజెన్సీ ప్రారంభం

హైదరాబాద్, జూన్ 29:అడ్వర్టైయిజింగ్, పబ్లిక్ రిలేషన్స్, డిజిటెల్ మార్కెటింగ్, కార్పొరేట్ ఈవెంట్ మేనేజ్మెంట్‌కు చెందిన కొత్త ఏజెన్సీ మల్టీవర్స్ హైదరాబాద్‌లో ప్రారంభమైంది. మాజీ జర్నలిస్టు విజయ్ అమృత్‌రాజ్ ఈ ఏజెన్సీని నెలకొల్పారు. వివిధ బ్రాండ్లకు విశ్వసనీయమైన ప్రమోషన్ ఏర్పాటు చేసే లక్ష్యంతో దీన్ని ప్రారంభించారు. పీఆర్‌లో విశేష అనుభవం ఉన్న ఆయన.. ఈ సంస్థను త్వరలో దేశంలోని వివిధ నగరాల్లో విస్తరించనున్నారు. గతంలో బయోలాజికల్-ఈ, టాటా ప్రాజెక్ట్స్ లిమిటెడ్ సంస్థల్లో ఆయన కార్పొరేట్ కమ్యూనికేషన్స్ హెడ్‌గా పనిచేశారు. ప్రఖ్యాత్య పబ్లిక్ రిలేషన్స్ ఏజెన్సీ రిడిఫ్యూజన్‌లోనూ ఆయనకు పనిచేసిన అనుభవం ఉన్నది. ఫార్మా దిగ్గజం డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్‌లోనూ ఆయన కార్పొరేట్ కమ్యూనికేషన్స్ వ్యవహారాలు చూశారు.

ప్రకటనల్లో భాగంగా సంప్రదాయ మరియు డిజిటల్ మాధ్యమాల్లోవ్యూహాత్మక బ్రాండ్ ప్రచారం, ప్రజాసంబంధాల్లో భాగంగా ప్రతిష్ఠ నిర్వహణ, మీడియాసంబంధాలు, సంక్షోభ కమ్యూనికేషన్, విధాన పరిరక్షణ ఈ ఏజెన్సీ చేపట్టనున్నది. డిజిటల్ మార్కెటింగ్‌లో సోషల్ మీడియా నిర్వహణ, కంటెంట్ మార్కెటింగ్, రాఖా, ఆన్‌లైన్, చెల్లింపు ఆధారిత డిజిటల్ ప్రచారాలు నిర్వహించనున్నారు. ఇక కార్పొరేట్ ఈవెంట్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా ఉత్పత్తుల ఆవిష్కరణలు, సంస్థాగత కార్యక్రమాలు, ప్రభుత్వ అనుబంధ కార్యక్రమాలు నిర్వహిస్తారు.

మల్టీవర్స్ మేనేజింగ్ డైరెక్టర్ విజయ్ అమృత్‌రాజ్ మాట్లాడుతూ.. హైదరాబాద్‌లోమల్టీవర్స్‌ను ప్రారంభించడం ఎంతో ఆనందంగాఉందని, చాలా సంస్థలు తమ బ్రాండ్ల గుర్తింపును పీఆర్, డిజిటల్, ప్రకటనలు, ఈవెంట్ మేనేజ్‌మెంట్ వేర్వేరు ఏజెన్సీల మధ్య విభజించుకోవాల్సివస్తోందని, ఆ పరిస్థితిని మార్చాలనే ఉద్దేశంతోనే మల్టీవర్స్‌ను స్థాపించానన్నారు. క్లయింట్-సైడ్‌అనుభవం, కార్పొరేట్ వ్యవహారాల నైపుణ్యం, దీర్ఘకాలిక బ్రాండ్ నిర్మాణంలో విశ్వసనీయ భాగస్వామిగా నిలుస్తామన్నారు.

# 'అంతర్జాతీయ సహకార వారోత్సవాలను జయప్రదం చేయండి'



ఖమ్మం, జూన్ 29:దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ సహకార వారోత్సవాలను విజయవంతం చేయాలని కొత్తగూడెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) అధ్యక్షుడు మండే వీరహనుమంతరావు పిలుపునిచ్చారు. సోమవారం అంతర్జాతీయ సహకార వారోత్సవాల సందర్భంగా కొత్తగూడెం సహకార సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన సహకార పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. రైతుల సంక్షేమం, సహకార రంగం అభివృద్ధి లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాయని తెలిపారు. రైతులు ఈ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు. సహకార సంఘాల బలోపేతం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత అభివృద్ధి చెందుతుందని, రాష్ట్రం, దేశం అభివృద్ధిలో రైతుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. అంతర్జాతీయ సహకార వారోత్సవాల సందర్భంగా రైతులు సహకార భావనతో ముందుకు వచ్చి సంఘాల అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం డైరెక్టర్ కె.రామచంద్రరావు, సంఘం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు

# 'యంగ్ ఇండియా స్కూల్ కొత్తగూడెం నియోజకవర్గానికి కీర్తి పతాక'

**- విద్యా హబ్‌గా మారనున్న కొత్తగూడెం జిల్లా కేంద్రం**

**- రూ.200 కోట్లతో అత్యాధునిక హంగులతో యంగ్ ఇండియా స్కూల్**

**-కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**

ఖమ్మం, జూన్ 29: ప్రపంచస్థాయి ప్రమాణాలతో ఏర్పాటు కానున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కొత్తగూడెం నియోజకవర్గానికి ఒక కీర్తి పతాక అని, ఈ స్కూల్ ఏర్పాటుతో కొత్తగూడెం జిల్లా కేంద్రం గొప్ప విద్యా హబ్'గా మారబోతోందని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. నియోజకవర్గంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా కొనసాగుతున్న 'యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాల' నిర్మాణ పనులను సోమవారం అధికారులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, స్థానిక నేతలతో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కులమతాలకతీతంగా అన్ని వర్గాల విద్యార్థులకూ ఒకే క్యాంపస్ లో విద్యను అందించాలనే ప్రభుత్వ ఆలోచన ఎంతో అభినందనీయమన్నారు. ఈ ప్రాజెక్టు కింద కొత్తగూడెం క్యాంపస్ లో రూ.200 కోట్ల అంచనా వ్యయంతో అత్యంత అత్యాధునిక హంగులతో ఈ స్కూల్ పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. 25.475 ఎకరాల భారీ విస్తీర్ణంలో, 5,38,246 చదరపు అడుగుల ప్లింత్ ఏరియాతో నిర్మిస్తున్న ఈ భారీ నిర్మాణాల్లో అకడమిక్ బ్లాక్, జూనియర్, సీనియర్ హాస్టల్ బ్లాకులు, డైనింగ్, కిచెన్ లతో పాటు సిబ్బంది కోసం క్వార్టర్లను నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. వచ్చే విద్యాసంవత్సరం నాటికి ఈ సరికొత్త స్కూల్‌ను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా నిర్దేశించుకొని పర్యవేక్షిస్తున్నామని తెలిపారు.

ఈ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం బోధనతో పాటు డిజిటల్ స్మార్ట్ క్లాస్ రూమ్‌లు, కంప్యూటర్ సెంటర్లు, సైన్స్ ల్యాబ్‌లు, 5000 పైగా పుస్తకాలతో కూడిన డిజిటల్ లైబ్రరీలను ఇక్కడ ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. విద్యార్థుల శారీరక, మానసిక వికాసం కోసం 200 మీటర్ల రన్నింగ్ ట్రాక్, క్రికెట్ గ్రౌండ్, వాలీబాల్, బాస్కెట్ బాల్, కబడ్డీ కోర్టులను ప్రత్యేకంగా నిర్మిస్తున్నామని తెలిపారు. అంతేకాకుండా, పర్యావరణ హితంగా ఉండేలా సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, సౌర, పవన విద్యుత్ వ్యవస్థలను, నీటి సంరక్షణ కోసం రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ విధానాలను ఇక్కడ అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలో రవాణా సౌకర్యాన్ని మెరుగు పర్చేందుకు నిరంతరం కృషి చేస్తున్నానని, ఇప్పటికే రోడ్లు, బ్రిడ్జీలు, అండర్ బ్రిడ్జీలు, ఓవర్ బ్రిడ్జీలు, ఔటర్ రింగు రోడ్లు కొన్ని నిర్మాణ దశలో ఉండగా, మరికొన్నింటికీ మంజూరు



లభించిందని తెలిపారు.అన్ని కులాలవారికి 17 కమ్యూనిటీ హాలు మంజూరు చేయడం జరిగిందని, ఎయిర్ పోర్టు, అంతర్జీతీయ క్రికెట్ స్టేడియం, క్రీడా మైదానాలు, జిమ్ ఏర్పాటు కాబోతున్నాయని తెలిపారు. నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అగ్రగామిగా నిలబెట్టేందుకు శక్తివంచ లేకుండా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, కొత్తగూడెం మేయర్ మూడ్ గణేష్, కమిషనర్ సుజాత, డీఈఓ వాసంతి, పాఠశాలల భవనాల పర్యవేక్షణ అధికారి వెంకటేశ్వర్ రావు, వివిధ శాఖల అధికారులు హేమ చంద్ర రావు, రాజగోపాల్, నాయకులు వాసిరెడ్డి మురళి, యూసుఫ్, ధర్మరాజు, కార్పొరేటర్లు ఎర్రబెల్లి శంకర్, దుర్గ, సుధాకర్, పద్మ, ఆకాంక్ష, హిమశ్రీ, బండి నర్సింహా, విజయ్, తులశమ్మ, సహేరా, కళావతి పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ తొలి ప్రాధాన్యత

**-ఏరువాక పౌర్ణమి సందర్భంగా రైతులతో కలిసి వ్యవసాయ పనులు ప్రారంభించిన మంత్రి కొలుసు పార్థసారధి**

అమరావతి, జూన్ 29:రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ తొలి ప్రాధాన్యత అని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. ఏరువాక పౌర్ణమి సందర్భంగా ముసునూరు మండలం లోపూడి గ్రామంలో భూమాతకు, వ్యవసాయ పనిముట్లకు పూజలు నిర్వహించి సంప్రదాయ రీతిలో వ్యవసాయ పనులను ప్రారంభించారు.

ఈ సందర్భంగా సంప్రదాయ రైతు దుస్తులు ధరించిన మంత్రి ఎడ్ల బండిపై గ్రామమంతా తిరుగుతూ రైతులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

మంత్రి మాట్లాడుతూ.. ఏరువాక పౌర్ణమి ఆంధ్రప్రదేశ్ రైతాంగానికి అత్యంత పవిత్రమైన వ్యవసాయ పండుగ అని, జ్యేష్ఠ శుద్ధ పౌర్ణమి రోజున ఖరీఫ్ సాగును శాస్త్రోక్తంగా ప్రారంభించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. వ్యవసాయాన్ని రైతులకు మరింత లాభసాటిగా మార్చేందుకు కూటమి ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు.

అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రతి రైతుకు ఏటా రూ.20 వేల ఆర్థిక సహాయం అందిస్తున్నామని చెప్పారు. రైతులు, కౌలు రైతులకు పంట రుణాలు, ఉచిత పంట బీమా, సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు, సాగు యాంత్రీకరణ పరికరాలు అందిస్తున్నామని తెలిపారు. రైతులు పండించిన పంటను కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించి, సొమ్మును నేరుగా వారి ఖాతాల్లో జమ చేస్తున్నామని పేర్కొన్నారు.

రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించి ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని రైతులకు సూచించారు. 80 శాతం సబ్సిడీపై వరి, పత్తి, మిర్చి, పప్పుధాన్యాల విత్తనాలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఖరీఫ్?2026 ఉచిత పంట బీమా నమోదు ప్రక్రియ ప్రారంభమైనందున ప్రతి రైతు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని కోరారు.

## ఇరువురు వ్యక్తులు మృతి

అమరావతి, జూన్ 29: కృత్తివెన్ను మండలం చిన్న గొల పాలెం గ్రామంలో అమానుష ఘటన సోమవారం జరిగింది చేపల వేటకి వెళ్లిన ఇద్దరు మృతి చెందగా, బైక్ కి తాళ్లతో కట్టి మృతదేహాలు ఉన్నాయి. మృతి చెందిన వ్యక్తులు శెట్టి సుబ్బన్న, గొలుసు అయ్యప్ప ఇద్దరు మామ అల్లుళ్లగా గుర్తించారు. అనుమానాస్పద మృతి కింద పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సిమెంట్ బస్తాతో దాడి.. వ్యక్తి మృతి

నల్గొండ, జూన్ 29:రామ కృష్ణా పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బొక్కల గుట్ట ప్రాంతంలో ఆదివారం రాత్రి దారుణ ఘటన చోటుచే సుకుంది. గజ్జి వెంకటేష్ అనే వ్యక్తి హత్యకు గురయ్యా డు.స్థానికుల కథనం ప్రకారం, అదే ప్రాంతానికి చెందిన ఒడ్డేపల్లి రాజ్‌కుమార్ గడ్డకట్టిన సిమెంట్ బస్తాను వెంకటేష్‌పై విసరడంతో ఆయన తీవ్రంగా గాయప డ్డాడు. కుటుంబ సభ్యు లు వెంటనే ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమ ధ్యలో మృతి చెంది నట్లు సమాచారం.

# సంఖ్యల సౌరభం - జాతీయ గణాంక దినోత్సవ సందేశం

ప్రతి సంవత్సరం జూన్ 29న భారత దేశంలో జాతీయ గణాంక దినోత్సవాన్ని జరుపు కోవడం అనేది గణాంకాల ప్రాముఖ్యతను గుర్తు చేసే ఓ అరుదైన సాంప్రదాయం. ఈ రోజు భారత గణాంక శాస్త్ర పితామహుడు, ప్రముఖ శాస్త్రవేత్త, ఆర్థిక ప్రణాళికా మార్గదర్శకుడు అయిన ప్రొఫెసర్ ప్రశాంత చంద్ర మహాలనోబిస్ జయంతి. ఆయన సేవలను స్మరించుకునే కార్యక్రమాలే ఈ దినోత్సవానికి మూలం. గణాంక శాస్త్రాన్ని భారతదేశ అభివృద్ధికి ఒక సూత్రమైన సాధనంగా తీర్చిదిద్దిన మహాలనోబిస్ కృషికి ఇదే సరైన నివాళి.

ప్రొఫెసర్ మహాలనోబిస్ 1893 జూన్ 29న కలకత్తాలో జన్మించారు. ప్రెసిడెన్సీ కాలేజీలో భౌతిక శాస్త్రం అభ్యసించి, తరువాత కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్య పొందారు. అక్కడే గణాంక శాస్త్రం పట్ల ఆయన ఆసక్తి పెరిగింది. తిరిగి భారతదేశానికి వచ్చిన తరువాత ఆయన స్థాపించిన ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ (ఐఎస్ఐ) దేశంలో గణాంక విద్య, పరిశోధనకు కేంద్రంగా మారింది. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన 'సంఖ్య' అనే పత్రికను ఆయన ప్రారంభించారు. వ్యవసాయ, ఉపాధి, జనాభా వంటి రంగాల్లో నమూనా సర్వేలు నిర్వహించి వాటి ఆధారంగా ప్రభుత్వ విధానాల రూపకల్పనకు మార్గదర్శకత్వం వహించారు. ఆయన అభివృద్ధి చేసిన "మహాలనోబిస్ దూరం" అనే గణాంక ప్రమాణం వర్గీకరణ, నమూనా గుర్తింపు వంటి అనేక సాంకేతిక రంగాల్లో ఉపయోగ పడుతోంది.




### జూన్ 29... జాతీయ గణాంక దినోత్సవం

1956లో ప్రారంభమైన ద్వితీయ పంచవర్ష ప్రణాళిక రూపకల్పనలో ఆయన రూపొందించిన "మహాలనోబిస్ మోడల్" అనేది పారిశ్రామికాభివృద్ధికి ప్రాముఖ్యత నిచ్చే విధంగా రూపొందించ బడింది. ఆయన సలహాలతో కేంద్ర గణాంక సంస్థ (సీఎస్ఓ) స్థాపించ బడింది, ఇది నేటి జాతీయ గణాంక కార్యాలయంగా పరిణమించింది. ఆయన సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం 1968లో పద్మవిభూషణ్ పురస్కారం ప్రదానం చేసింది.

జాతీయ గణాంక దినోత్సవం ద్వారా గణాంకాల సామర్థ్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నాలు జరుగు తున్నాయి. గణాంకం కేవలం గణన కోసం మాత్రమే కాక, ప్రభుత్వ పాలన, విధాన నిర్ణయాలలో విశ్వసనీయ ఆధారంగా నిలుస్తుంది. ఉదాహరణకు, 2023 నాటికి భారత్ జనాభా 142 కోట్లకు చేరింది. ఈ జనాభా నిర్మాణాన్ని బట్టి వివిధ సందర్భాలలో విద్యా అవసరాలు, ఆరోగ్య సేవల కేటాయింపులు, ఉపాధి ప్రణాళికలు రూపొందించ బడుతున్నాయి.

అంతేకాక, పేదరిక స్థాయి గణాంకాల ప్రకారం 2011?12లో దేశంలో 21.9 శాతం మంది పేదరిక రేఖకు దిగువన ఉన్నారు. ఇటువంటి గణాంకాలు లేకుండా ఏ విధానం ప్రయోజనకరంగా ఉంటుందో అంచనా వేయడం అసాధ్యం.

ఇప్పటి డేటా ఆధారిత ప్రపంచంలో గణాంక శాస్త్రం మరింత విస్తరించి, డేటా సైన్స్, మిషన్ లెర్నింగ్, కృత్రిమ మేధస్సు వంటి రంగాల్లో అనుసంధాన మవుతోంది. బిగ్ డేటా విశ్లేషణలు, ఆన్‌లైన్ సర్వేలు, డిజిటల్ డేటా సమీకరణం వంటివి సమాజం లోని మార్పులను విశ్లేషించడానికి కీలకంగా మారాయి. ప్రభుత్వం పలు కీలక పథకాలను, ఉదాహరణకు, ఉజ్వల యోజన, ఆరోగ్య మిషన్ వంటి వాటిని గణాంక ఆధారంగా లక్ష్యంగా మలచ గలిగింది. దీనివల్ల సమర్థవంతమైన సేవల అందుబాటు సాధ్యమైంది.

ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్, కోల్‌కతా ప్రధాన కేంద్రంగా ఉండగా, ఢిల్లీ, బెంగళూరు, హైదరాబాద్ తదితర నగరాల్లో శాఖలు ఉన్నాయి. ఈ సంస్థ అప్లయిడ్ స్టాటిస్టిక్స్, బయోస్టాటిస్టిక్స్, ఎకనోమెట్రిక్స్, కంప్యూటర్ సైన్స్ వంటి రంగాల్లో పరిశోధనలను ప్రోత్సహిస్తోంది. యునెస్కో, ఐక్యరాజ్య సమితి వంటి సంస్థలకు ఐఎస్ఐ వితరణలూ, సూచనలూ ముఖ్యమవుతున్నాయి.

భారతదేశంలో అనేక విశ్వవిద్యాలయాలు గణాంక విద్యను అందిస్తున్నాయి. ఐఐటి, ఐఐఎస్సీ, ఐఎస్ఐ వంటి సంస్థలలో గణాంకంలో అగ్రశ్రేణి విద్య, పరిశోధన జరుగుతోంది. డేటా అనాలిటిక్స్, ఆప్టిమైజేషన్ వంటి కోర్సులు ద్వారా యువతకు ఉన్నతమైన ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయి. గణాంకం + కంప్యూటర్ సైన్స్ అనేది ప్రస్తుత కాలంలో శక్తివంతమైన కలయికగా నిలుస్తోంది.

2025 సంవత్సరానికి 'గణాంకాల ద్వారా సమగ్ర అభివృద్ధి' అనే అంశం గణాంక దినోత్సవం థీమ్‌గా తీసుకోవడం, ప్రగతి సాధనలో గణాంకాల కీలకతను గుర్తించడంలో ఒక ముఖ్య సూచన. ఆరోగ్యం, విద్య, పర్యావరణ పరిరక్షణ, స్త్రీ-పురుష సమానత్వం వంటి రంగాల్లో గణాంకాలు మార్గదర్శకాలుగా నిలుస్తున్నాయి.

ఈ నేపథ్యంలో జాతీయ గణాంక దినోత్సవం ముఖ్యమైన సందేశాన్ని అందిస్తుంది ? సమాజాన్ని శాస్త్రీయంగా అర్థం చేసుకునే శక్తి గణాంకాల్లో ఉంది. ప్రతి డేటా సూత్రం ఒక పరిశోధనకు ద్వారం, ప్రతి విశ్లేషణ ఒక సమాజాన్ని మెరుగు పరచే అవకాశం. గణాంకాల మౌలికతను మనం గుర్తించినపుడే, నిజమైన ప్రజా సంక్షేమ ప్రణాళికలు పుడతాయి. అలాంటి గణన దిశలో మహాలనోబిస్ లాంటి మహనీయులను స్మరించుకుంటూ, నిజమైన గణాంక విజ్ఞానంతో ముందుకు సాగడం ఈ దినోత్సవ అసలైన శుభార్థం.



-రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

## ఆఫ్ఘన్ బోర్డర్ వద్ద పాక్ గ్రౌండ్ ఆపరేషన్, వైమానిక దాడులు..
# 29 మంది మిలిటెంట్లు మృతి




ఇస్లామాబాద్, జూన్ 29:పాకిస్థాన్ -ఆఫ్ఘనిస్తాన్ బోర్డర్ వద్ద పాక్ భద్రతా దళాలు ఆదివారం గ్రౌండ్ ఆపరేషన్ నిర్వహించాయి. ఆ తర్వాత మిలిటెంట్ స్థావరాలు, సురక్షిత ప్రాంతాలపై వైమానిక దాడులు చేపట్టింది. ఆ దాడుల్లో సుమారు 29 మంది ఫైటర్లు మరణించినట్లు పాక్ అధికారి చెప్పారు. ఆ దేశ సమాచార శాఖ మంత్రి అయతుల్లా తారర్ తన ఎక్స్ అకౌంట్‌లో ఈ విషయాన్ని తెలిపారు. దేశంలో జరుగుతున్న మిలిటెంట్ల దాడుల నేపథ్యంలో సరిహద్దు వద్ద ఆపరేషన్ చేపట్టినట్లు మంత్రి అయతుల్లా పేర్కొన్నారు. అయితే ఈ దాడుల ఘటనపై ఇప్పటి వరకు ఆఫ్ఘనిస్తాన్ సర్కారు ఎటువంటి ప్రకటన చేయలేదు.

కరాచీలో ఉన్న సింధ్ రేంజర్స్ ప్రధాన కార్యాలయంపై గన్నులు, పేలుడు పదార్థాలతో మిలిటెంట్ల దాడి చేసిన మరుసటి రోజు ప్రభుత్వం మిలిటరీ కేంద్రాలను టార్గెట్ చేసిందన్నారు. ఖైబర్ ఫక్తునక్వా ప్రావిన్సులో ఉన్న ఖైబర్ జిల్లాలో ఇంటెలిజెన్స్ సమాచారం ఆధారంగా పాక్ దళాలు గ్రౌండ్ ఆపరేషన్ నిర్వహించాయి. ఖాన్ ఫరోష్ అనే మిలిటెంట్‌తో పాటు మరో నలుగురు ఆ ఆపరేషన్‌లో ప్రాణాలు కోల్పోయారు.

ఆ తర్వాత ఆఫ్ఘనిస్తాన్‌లోని మూడు ప్రాంతాలపై వైమానిక దాడులకు పాల్పడింది. పక్తియా, పక్తికా, కునార్ ప్రాంతాల్లో దాడులు జరిగాయి. ధ్వంసమైన ఉగ్ర క్యాంపులు.. జమాత్ ఉల్ అహ్రార్, ఫితనా అల్ ఖ్వారిజికి చెందినట్లు పాక్ మంత్రి తెలిపారు. సుమారు 25 మందికిపై మిలిటెంట్లను హతమార్చామని, అక్కడ నుంచి ఆయుధాలు, మందుగుండు సామాగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు మంత్రి చెప్పారు.

## పోచంపల్లి చేనేత సహకార సంఘం ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల

**-జులై 10న చేనేత సంఘ ఎన్నికలు**

నల్గొండ, జూన్ 29: జూలై 10. ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు

అనంతరం ఎన్నికల కౌంటింగ్ జరుగునని ఎన్నికల అధికారి తెలిపారు. సంఘంలో 9 మంది డైరెక్టర్లను రహస్య ఓటింగ్ పద్ధతిలో సభ్యులు ఎన్నుకుంటారని, ఇందులో ఇద్దరు మహిళా డైరెక్టర్లు, ఏడుగురిని జనరల్ కేటగిరీలో ఎన్నుకుంటారని ఆయన తెలిపారు.

## డివైడర్ ఢీకొని ఆర్టీసీ బస్సు బోల్తా..
# 20 మంది ప్రయాణికులకు గాయాలు



వనపర్తి జూన్ 29: వనపర్తి జిల్లా పెబ్బేరు సమీపంలో ఆర్టీసీ బస్సు ప్రమాదానికి గురైంది. మంత్రాలయం నుంచి వనపర్తికి వస్తున్న బస్సు 44వ నంబర్ జాతీయ రహదారిపై డివైడర్‌ను ఢీకొట్టడంతో అదుపుతప్పి బోల్తా పడింది.

ఈ ప్రమాదంలో సుమారు 20 మంది వరకు ప్రయాణికులు గాయపడినట్లు సమాచారం. బస్సు బోల్తా కొట్టి రోడ్డుకు అడ్డంగా పడటంతో రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. కాగా, ప్రమాదం గురించి స్థానికులు అందించిన సమాచారం వేరకు పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను పెబ్బేరు ఆస్పత్రితో పాటు వనపర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

# శాస్త్రీయ సాగుతో రైతు ఆదాయం పెంపే ప్రభుత్వ లక్ష్యం

**-మార్కెట్ అవసరాలకు అనుగుణంగా పంటలు సాగు చేయాలి: మంత్రి అచ్చెన్నాయుడు**



అమరావతి, జూన్ 29:శాస్త్రీయ సాగు విధానాలు, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా పంటల ప్రణాళిక, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగంతో రైతుల ఆదాయాన్ని పెంచడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, మార్కెట్ సదుపాయాలు కల్పిస్తూ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం కార్యాచరణ అమలు చేస్తోందని తెలిపారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర జనాభాలో 66 శాతం మంది వ్యవసాయం, అనుబంధ రంగాలపై ఆధార పడుతున్నందున ఈ రంగానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. గత ప్రభుత్వ హయాంలో వ్యవసాయ, నీటిపారుదల శాఖలు నిర్లక్ష్యానికి గురయ్యాయని ఆరోపించిన ఆయన, విత్తన కంపెనీల బకాయిలు చెల్లించి సరఫరా వ్యవస్థను పునరుద్ధరించామని తెలిపారు. ప్రస్తుతం నాణ్యమైన విత్తనాలు, ఎరువులను సకాలం లో రైతులకు అందిస్తున్నామని చెప్పారు.

ఒకే పంటపై అధికంగా ఆధారపడకుండా మార్కెట్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని పంటల సాగు చేయాలని రైతులకు సూచించారు. అధిక రసాయనాల వినియోగం వల్ల ఎగుమతులపై ప్రతికూల ప్రభావం పడుతున్న నేపథ్యంలో వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలను పాటించాలని కోరారు. ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పంటల ఎంపికలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

రాష్ట్రంలో ఎక్కడా ఎరువుల కొరత లేదని స్పష్టం చేసిన మంత్రి, ప్రత్యేక యాప్ ద్వారా కేవలం 20 రోజుల్లోనే 15 లక్షలకు పైగా ఎరువుల బస్తాలను పంపిణీ చేశామని తెలిపారు. మూడు లక్షలకుపైగా కౌలు రైతులు కూడా ఈ సేవలను వినియోగించుకున్నారని చెప్పారు. మట్టి పరీక్షల ఆధారంగా సమతుల్య ఎరువుల వినియోగంతో దిగుబడులు, నాణ్యత పెరుగుతాయని పేర్కొన్నారు.

వర్జీనియా పొగాకు ధరల విషయంలో రైతులకు నష్టం జరగకుండా చర్యలు తీసుకున్నామని, కిలో రూ.200 కంటే తక్కువ ధరకు కొనుగోలు చేయవద్దని వ్యాపారులకు సూచించినట్లు తెలిపారు. ఉద్యానవన పంటలకు దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో మంచి డిమాండ్ ఉన్నందున రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని పిలుపు నిచ్చారు. తోతాపురి మామిడి రైతులకు ఈ ఏడాది కూడా కిలోకు రూ.4 చొప్పున ప్రోత్సాహకం కొనసాగుతుందని వెల్లడించారు.

అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు హామీ మేరకు ఆర్థిక సాయం అందిస్తున్నామని, వ్యవసాయాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కటుబడి ఉందని మంత్రి తెలిపారు.

ఈ సందర్భంగా గత వైసీపీ ప్రభుత్వంపై మంత్రి విమర్శలు చేశారు. అమరావతి రైతుల త్యాగాలను విస్మరించిన వైసీపీ నేతలకు రాజధాని గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని, ప్రజల ఆగ్రహానికి వారే బాధ్యత వహించాల్సి ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మ, ఎమ్మెల్యేలు ధూళిపాళ్ల నరేంద్ర, బూర్ల రామాంజనేయులు, వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఎంపీ కేశినేని చిన్ని

విజయవాడ, బ ప్రజలకు ఇచ్చిన హామీలను కార్యరూపంలో చూపిస్తూ విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివనాథ్ (చిన్ని) మరో కీలక అభివృద్ధి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. దశాబ్దాలుగా గుణదలనున్న ప్రాంత ప్రజలను వేధిస్తున్న రైల్వే గేటు ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారంగా రూ.98.68 కోట్ల వ్యయంతో నిర్మించనున్న అత్యాధునిక రోడ్డు ఓవర్ బ్రిడ్జి (ఆర్‌ఓబీ)కి సోమవారం ఘనంగా శంకుస్థాపన చేశారు. ఎన్నికల సమయంలో గుణదల ప్రజలకు ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం తీసుకొస్తానని హామీ ఇచ్చిన కేశినేని చిన్ని, ఆ మాటను ఏడాది వ్యవధిలోనే నిలబెట్టుకోవడం స్థానిక ప్రజల్లో విశేష చర్చనీయాంశంగా మారింది.

ఈ శంకుస్థాపనతో "మాటలు కాదు, చేతలే" అనే సందేశాన్ని ఆయన మరోసారి ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లారని ని ఽ ం ల ం అభిప్రాయపడుతున్నారు. శంకుస్థాపన కార్యక్రమంలో మాట్లాడిన ఎంపీ కేశినేని చిన్ని, గుణదల ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న రోజు ఇదని, ఈ ఆర్‌ఓబీ పూర్తయితే గుణదలనున్న ప్రాంతాల రాకపోకలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడమే తన బాధ్యత అనీ అభివృద్ధి ఆగదనీ, డబల్ ఇంజిన్ సర్కారుతో తమ ప్రయాణం కొనసాగుతుందిఅని స్పష్టం చేశారు.



విజయవాడ పార్లమెంట్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న అన్ని రైల్వే ఓవర్ బ్రిడ్జిలను దశలవారీగా పూర్తి చేయడమే తన లక్ష్యమని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే బోండా ఉమా మహేశ్వరరావుతో సమన్వయం చేసుకుంటూ ఉలవచారు కంపెనీ సమీపంలో మరో ఆర్‌ఓబీకి కూడా త్వరలో శంకుస్థాపన చేసి, రెండేళ్లలో పూర్తయ్యేలా పర్యవేక్షిస్తామని వెల్లడించారు. గుణదల రైల్వే లెవెల్ క్రాసింగ్ నంబం-316 వద్ద రోజూ సుమారు 170 రైళ్లు రాకపోకలు సాగుతుండటంతో గేటు దాదాపు 14 నుంచి 16 గంటల పాటు మూసివేయాల్సిన పరిస్థితి నెలకొంది.

వేలాది మంది వాహనదారులు ప్రతిరోజూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ ఆర్‌ఓబీ పూర్తయిన తర్వాత ప్రస్తుతం 15 నుంచి 20 నిమిషాలు పట్టే నిరీక్షణ సమయం దాదాపు నిమిషానికి తగ్గనుంది. ట్రాఫిక్ సమస్య పూర్తిస్థాయిలో తొలగి రాకపోకలు సులభతరం కానున్నాయి. రూ.98.68 కోట్ల వ్యయంతో నిర్మించే ఈ ఆర్‌ఓబీ 920 మీటర్ల పొడవుతో, 18 స్పాన్లతో అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించనున్నారు. ప్రధాన రహదారితో పాటు సర్వీస్ రోడ్లు, క్రాష్ బ్యారియర్లు, ఆధునిక డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రాజెక్టును 18 నెలల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు.

ఈ సందర్భంగా ఎంపీ కేశినేని చిన్ని మాట్లాడుతూ, ఈ ప్రాజెక్టు కోసం కేంద్ర రైల్వే శాఖతో పలుమార్లు చర్చలు జరిపి, ప్రజల సమస్యను పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేశామని తెలిపారు. ఈ అవకాశం కల్పించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

గుణదల ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేర్చడం ద్వారా "మాట నిలబెట్టుకునే నాయకుడు"గా ఎంపీ కేశినేని చిన్ని మరోసారి తన ప్రత్యేకతను చాటుకున్నారని స్థానికులు పేర్కొంటున్నారు.

గుణదల ఆర్‌ఓబీ శంకుస్థాపన విజయవాడ అభివృద్ధి చరిత్రలో మరో కీలక మైలురాయిగా నిలవనుందని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో రైల్వే అధికారులు ఏ డి ఆర్ ఎమ్ ఎడ్విన్, సైమన్, డీ సీ ఎమ్ ప్రశాంత్ కుమార్, సీనియర్ ఇంజినీర్ ఎస్ శ్రీనివాసరావు, రమణారావు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. స్థానిక టీడీపీ నాయకులు, సీనియర్ నాయకులు బొప్పన భవ కుమార్ జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి చిట్టిబాబు, రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి దాసరి ఉదయశ్రీ, కె కిరణ్, రఘురామరాజు, గురునాథం, భవకుమార్, కరీముల్లా, సాయి చరణ్, ఉషారాణి, సంజయ్ వర్మ, వల్లభనేని సతీష్, రేగేళ్ల లక్ష్మణరావు, పిళ్లా శ్రీనివాసరావు, ఆషా, మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.